ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శనివారం 27 ఏప్రిల్ 2024





రేపల్లె : జగనన్న కాలనీలో బిల్లులు రాకపోవటంతో నిలిచిపోయిన గృహాలు




గుంటూరులోని జగనన్న కాలనీలో పునాదులకు కూడా నోచుకోని వైనం.

జగనన్న ఊళ్లు పునాదుల్లోనే..

కాలనీలు కాదు.. ఊళ్లను నిర్మిస్తున్నాం అని ఆర్భాటంగా సీఎం జగన్ ప్రకటించి నాలుగేళ్లు అవుతున్నా కాలనీలు ఊళ్లుగా మారలేదు కాని చిట్టడవులను తలపిస్తున్నాయి. నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన హడావుడి ప్రకటనలకే పరిమితమైందని జగనన్నకాలనీల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. ఇళ్లు నిర్మించి ఇచ్చే విషయంలో ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేసి మెలిక పెట్టడంతో లబ్ధిదారులు నిర్మాణాలపై వెనుకంజ వేశారు. ఇప్పటికీ చాలాకాలనీల్లో రోడ్లు లేవు.. డ్రెయిన్లు లేవు.. తాగునీరు, కరెంటు లేదు. పేరుగొప్ప, ఊరుదిబ్బ అనుచందంగా జగనన్నకాలనీలు ఉన్నాయి. ఇల్లు కట్టుకోకుంటే స్థలం పోతుందని.. లేదంటే మరొకరికి ఇచ్చేస్తామని లబ్ధిదారులను బెదిరించి మరీ ఇళ్లను నిర్మించుకునేలా అధికారులు చేసినా పెద్దగా నిర్మాణాలు సాగలేదు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు.. ఇల్లు కట్టుకున్న తర్వాత నివాసం ఉండేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించటంలో అధికారులు విఫలమయ్యారు.

నెరవేరని పేదల సొంతింటి కల

- చిట్టడవుల్లా మారిన జగనన్న కాలనీలు
- కట్టిస్తామని మడమ తిప్పిన సీఎం జగన్
- బిల్లుల జాప్యంతో బేస్‌మెంట్ల స్థాయిలోనే ఇళ్లు
- ఇంకా పూర్తికాని మౌలిక సదుపాయాల కల్పన
- సగం కాలనీల్లో స్థలాల మెరక, అప్రోచ్ రోడ్లే కరువు
- పేరుగొప్ప, ఊరుదిబ్బ అనుచందంగా జగనన్న కాలనీలు



ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 26: 'పేదలకు సొంతింటి కల నెరవేరుస్తా. పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తా. వాటిని అక్క చెల్లెమ్మల పేరు మీదే రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తా.. అని పేదల ఇళ్ల నిర్మాణంపై జగన్ ఇచ్చిన హామీ అమలు అంతంతమాత్రంగానే ఉంది. హామీ ఇచ్చి ఏళ్లు గడిచినా జగనన్న కాలనీలు ఇంకా చాలావరకు అందుబాటులోకి రాలేదు. పేదలకు ఇంటిని ప్రభుత్వమే కట్టిస్తుందని, కాలనీల్లో సకల సౌకర్యాలు కల్పిస్తుందని తొలుత సీఎం జగన్ ప్రకటించారు. అయితే జగనన్నకాలనీల ప్రారంభోత్సవం అనంతరం లబ్ధిదారులే కట్టుకోవాలని ఒత్తిడి తెచ్చారు. అయితే చాలామంది ఆసక్తి చూపలేదు. ఎన్నికలు సమీపిస్తుండటంతో గత నవంబరులో కొద్ది మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి పేదల సొంతింటి కల నెరవేర్చినట్లు ప్రకటించుకుంది. క్షేత్ర స్థాయిలో పేదల ఇళ్ల నిర్మాణం అధోగతిలో ఉంది. మొత్తం నిర్మాణ లక్ష్యంలో నాలుగోవంతు కూడా పూర్తి చేయలేకపోయారు. మిగిలిన ఇళ్ళ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను సాధించడంలో ప్రభుత్వం చతికిల పడింది. కాలనీలకు మౌలిక వసతుల కల్పనలో తీవ్ర జాప్యంతోనే నిర్మాణాలు సక్రమంగా సాగలేదని తెలు స్తోంది. పలు కాలనీల్లో పూర్తయిన ఇళ్లల్లో నివాసం ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి. మౌలిక వసతుల కల్పన జరగకపోవడం, ఊరికి దూరంగా కాలనీలు ఉండటం, రవాణా సౌకర్యం లేక పోవడం తదితర అంశాలతో అక్కడకు వెళ్లి పెద్ద మొత్తంలో వెచ్చించి ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. అధికారులు ఎన్ని ఒత్తిళ్లు తెచ్చి ఇళ్ల నిర్మాణాలు చేయించ చినా సకాలంలో బిల్లులు రాక చాలాఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలోనే నిలిచిపోయాయి. ఇప్పటికే అప్పులు పాలయ్యాం ఇక తమ వల్ల కాదని లబ్ధిదారులు వెనుకంజ వేశారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అనేక జగనన్న కాలనీలు పిచ్చి చెట్లతో అధ్వానంగా మారాయి. కాలనీ లల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం, విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాల విషయంలో తీవ్ర జాప్యం జరిగింది. వర్షం కురిస్తే రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. జగన్ ప్రతి పక్ష నేతగా హామి ఇచ్చిన మేరకు రూ 5 లక్షలు ఇచ్చారా? అంటే లేదు, ఇంటి నిర్మాణానికి తగ్గట్టుగా వ్యయాన్ని పెంచలేదు. ఇంటి నిర్మాణ వ్యయం భారీగా పెరిగి ఇల్లు కట్టుకోవడం లబ్ధిదారులకు సాధ్యం కాలేదు. దీంతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నాలు గేళ్లగా ముందుకు సాగలేదు.

- రేపల్లెలో 3,008 మందికి స్థలాలు కేటాయించగా 1800 ఇళ్ల నిర్మాణం జరిగింది. బిల్లులు రాక 1208 గృహాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. ఇక నిర్మించుకున్న గృహాలకు నేటికి రహదారుల నిర్మాణం చేపట్టలేదు. తాగునీటి సరఫరా, డ్రెయినేజీ వ్యవస్థ లేదు.
- వేమూరు నియోజకవర్గంలోని 89 గ్రామాల్లో 15,590 మంది లబ్ధిదారులకు జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయించారు. ఇల్లు కట్టుకోమని చెప్పారు. కానీ వీరిలో కేవలం 2421 మంది మాత్రమే నిర్మాణాలు చేపట్టగలిగారు. 3123 మంది లబ్ధిదారులు బేస్మెంట్ లెవల్ నిర్మాణం వరకే చేపట్టి వదిలేశారు. 299మంది రూఫ లెవల్ నిర్మాణం చేశారు.
- అద్దంకి పట్టణానికి 2 నుంచి 4 కిలోమీటర్ల దూరంలోని బొమ్మనంపాడురోడ్డు, నాగులపాడురోడ్డు, వేలమూరిపాడు రోడ్డులోని జగనన్న లేఅవుట్లలో సుమారు 2 వేల మందికి స్థలాలు ఇచ్చారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభిస్తే మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పి ఝలక్ ఇచ్చారు. దీంతో ఇళ్ల నిర్మాణం పూర్తయినా నివాసయోగ్యంగా లేకపోవడంతో అద్దె ఇళ్లల్లోనే ఉంటున్నట్లు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూపాయి ఇవ్వకుండా గొప్పలు

పేదలందరికీ ఇళ్ల నిర్మాణం పేరుతో రూపాయి కూడా ఇవ్వకుండా తామే ఇళ్ల నిర్మించి ఇస్తున్నట్లు జగన్ ప్రచారం చేసుకున్నారు. కేంద్రం ద్వారా ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు ఇవ్వగా వాటిని జగన్ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుని, అది తానే ఇచ్చినట్లు లబ్ధిదారులకు ప్రచారం చేసుకుంది. ఇళ్లు తామే నిర్మించి ఇస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటోంది. ఒక్క రూపాయి కూడా పేదోడి ఇంటి కోసం ఖర్చు చేయని ప్రభుత్వంగా సీఎం జగన్ నిలిచిపోయారని పలువురిలో అసహనం వ్యక్తమవుతోంది.



వేమూరు: వెల్లబాడులో బీడుగా మారిన ఇళ్ళ స్థలాలు



వేమూరు : అబ్బనగూడవల్లిలో జగనన్న కాలనీ ఇళ్ల పరిస్థితి



వినుకొండ : వెంకుపాలెం వద్ద జగనన్న కాలనీలో నిర్మాణంలో ఇళ్ళు



బాపట్ల : కర్లపాలెం మండల కేంద్రంలోని జగనన్నకాలనీలో గృహాలు నిర్మించకుండా ఉన్న ఖాళీ స్థలాలు.


బాపట్లలో ప్యాడిసన్‌పేట, బేతనీకాలనీ, మూలపాలెం రోడ్డులో జగనన్నలేఅవుట్లలో 3,400మందికి స్థలాలు ఇచ్చారు. అందులో ఇప్పటి వరకు 1800 గృహ నిర్మాణాలు పూర్తి చేశారు. కాలనీలలో రోడ్లు, తాగునీరు లేవు. కొంతమంది గృహాలు నిర్మించుకోవడానికి తెచ్చుకున్న అప్పులు తీర్చలేక వడ్డీ పెరిగిపోయి విక్రయించే పరిస్థితి ఏర్పడింది. ఖాళీ స్థలాలు చేతులు మారాయి. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలల్లో నాలుగు వేల మందికి స్థలాలు ఇవ్వగా అక్కడ కూడా ఇదే పరిస్థితి.



అద్దంకి: బొమ్మనంపాడు రోడ్డులోని కాలనీ వద్ద చిల్లచెట్లు

స్క్రూటినీ.. ఉత్కంఠ

- వైసీపీ నామినేషన్లు తిరస్కరించాలని డిమాండ్
- శివకుమార్ నామినేషన్ ఆమోదంపై ఈసీకి టీడీపీ ఫిర్యాదు
- మురళీకృష్ణ నామినేషన్ ఆమోదంపై కోర్టుకు వెళ్తాం : నరేంద్ర



తెనాలి వైసీపీ అభ్యర్థి శివకుమార్ తన నామినేషన్‌తోపాటు సమర్పించిన అఫిడవిట్ ఫారం-26

నోటరీ చేసిన సంతకం 23వ తేదీతో ఉంటే, నిర్ధారిస్తూ శివకుమార్ చేసిన సంతకం 24వ తేదీతో ఉన్న దృశ్యం

తెనాలి(ఆంధ్రజ్యోతి), పొన్నూరుటౌన్, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన స్క్రూట్నీ శుక్రవారం ఆయా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారు ల కార్యాలయాల్లో జరిగింది. స్క్రూట్నీ అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో జరిగింది. అయితే గుంటూరు జిల్లా పొన్నూరు, తెనాలి, బాపట్ల జిల్లాలోని చీరాల అసెంబ్లీ స్థానా లకు సంబంధించిన నామినేషన్ల స్క్రూట్నీలో ఉత్కంఠ నెల కొంది. తెనాలి, పొన్నూరు వైసీపీ అభ్యర్థుల నామినేషన్లపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తెనాలిలో కాంగ్రెస్ తరఫున ఇద్దరు నామినేషన్లు వేయగా వారి నామినేషన్లు తిరస్కరకు గురయ్యాయి. ఇక గుంటూరు పశ్చిమ, వినుకొండ లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్లపై కొన్ని అభ్యంతరాలు వచ్చాయి.

వేర్వేరు తేదీల్లో అన్నాబత్తుని సంతకాలు

తెనాలి వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమర్పించిన నామినేషన్‌లో వేర్వేరు తేదీల్లో సంతకాలు ఉండటంపై టీడీపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆయన నోటరీ చేసిన సంతకం ఒక తేదీతో, అభ్యర్థి సమర్పించిన నామినేషన్ పత్రాల్లో మరో తేదీతో సంతకాలు ఉన్నాయని ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమని తేల్చారు. ఈ నెల 23వ తేదీతో నోటరీ సంతకం ఉండగా, అభ్యర్థి సంతకం ఈ నెల 24వ తేదీతో ఉందని అభ్యంతరం చెప్పిన టీడీపీ నాయకులు దానిని తిరస్కరించాలని ఆర్‌వోకు సూచించారు. అయితే స్క్రూట్నీ అనంతరం ఆ నామినేషన్‌ను అనుమతించినట్లు ఆర్‌వో ఆన్‌లైన్‌లో పెట్టేశారు. దీనిపై టీడీపీ ఎన్నిల సంఘానికి ఫిర్యాదు చేయగా ఈసీ ఏవిధమైన నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉత్కంఠత నెలకొంది. అయితే శివకుమార్ భార్య పుష్ప స్వతంత్ర అభ్యర్థిగా చివరి రోజు దాఖలు చేసిన నామినేషన్ చెల్లుబాటైనట్లు ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.

మురళీకృష్ణ ఆస్తుల వివరాలపై అభ్యంతరం

పొన్నూరు వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ తన అఫిడవిట్‌లో భార్య, కుమార్తె ఆస్తుల వివరాలు అందచేయలేదని ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలని టీడీపీ నాయకులు తెలిపారు. నోటరీ చేసిన వ్యక్తి అనుమతి గుంటూరుకే పరిమితమైనందున అది చెల్లదని ఫిర్యాదు చేశారు. తాము లేవనెత్తిన అభ్యంతరాల మేరకు అంబటి నామినేషన్‌ను తిరస్కరించకుండా ఆమోదించినందున కలెక్టర్‌కు, సీఈవో, న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు నరేంద్రకుమార్ స్పష్టం చేశారు.

గజదొంగ అంబటి : ధూళిపాళ్ల

పొదుపు మహిళలకు చెందిన రూ.2.5 కోట్లను తన సొంత ఖాతాలకు మళ్లించుకుని కాజేసిన గజదొంగ అంబటి మురళీకృష్ణ అని పొన్నూరు టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విలేకర్ల సమావేశంలో ఆరోపించారు. వనిత భారతీ, బాపట్ల మహిళా, భావపురి మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ థ్రిఫ్ట్ సొసైటీలు, రత్నమణి మహిళా మ్యాక్స్ లిమిటెడ్ వంటి సొసైటీల్లో మహిళలు దాచుకున్న నగదును మురళీకృష్ణ రుణాల పేరుతో సొంత ఖాతాలకు మళ్లించుకున్నారన్నారు. ఆయన దాఖలు చేసిన అఫిడవిట్‌లోనే ఈ అంశాలను పొందుపరిచినట్లు చెప్పారు. అంబటి నామినేషన్‌లో పలు అభ్యంతరాలపై తాము ఫిర్యాదు చేసినా అధికారులు ఆమోదించడం సరికాదన్నారు. బీ ఫారం సమర్పించలేదని స్వయంగా అభ్యర్థి చెప్పినా తానే ఎక్కడో పెట్టినట్లు ఆర్వో నింద తనమీద వేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల అధికారులు వైసీపీ నేతల ఒత్తిడికి లొంగిపోయారని ఆరోపించారు.




నామినేషన్ల పరిశీలనకు హాజరైన నరేంద్ర కుమార్, మురళీ

తెనాలి, పొన్నూరులో అభ్యంతరాలు

తెనాలిలో కాంగ్రెస్ గాయబ్

తెనాలిలో కాంగ్రెస్ తరపున ఇద్దరు వేసిన నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మొదట తెలంగాణకు చెందిన బషీద్ షేక్‌ను తెనాలి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా షర్మిల ప్రకటించి ఎన్నికల ప్రచార సభలో ఆయనను గెలిపించాలని కోరారు. అయితే ఆయన నామినేషన్ వేసిన తర్వాత తమ అభ్యర్థి ఆయన కాదని, స్థానికంగా ఇప్పటి వరకు ఆ పార్టీ వ్యవహారాలు చూస్తున్న డాక్టర్ చందు సాంబశివుడినే ఖరారు చేశారు. చివరి రోజున ఆయన హడావిడిగా నామినేషన్ వేశారు. అయితే బషీద్ ఓటు తెలంగాణలో ఉండటంతో ఆయన నామినేషన్‌ను స్క్రూట్నీలో అధికారులు తిరస్కరించారు. రెండో అభ్యర్థిగా రంగంలోకి దిగిన సాంబశివుడు నామినేషన్ బీ ఫారం విషయంలో తిరస్కరణకు గురైంది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరూ రంగంలో లేకుండాపోయారు.

రజిని, బొల్లా నామినేషన్లపై అభ్యంతరాలు



నామినేషన్‌లో తప్పుడు సమాచారాన్ని అందించిన పత్రం

గుంటూరు పశ్చిమ వైసీపీ అభ్యర్థి మంత్రి విడదల రజిని, వినుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నామినేషన్లపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వారి నామినేషన్ తప్పులతడక అని తెలిపారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా రజిని ఇష్టం వచ్చినట్లు అఫిడవిట్‌ను మార్చి వేశా రని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాస రావు మండిపడ్డారు. అమెరికా పౌరసత్వం కలిగిన రజిని భర్త కుమారస్వామి నిబంధనలకు విరుద్ధంగా చిలకలూరిపేటలో భూమి కొనడం చట్ట విరుద్ధమన్నారు. రజిని ఆదాయం లక్షల్లో ఉంటే రూ.కోట్లతో ఆస్తులు ఎలా కొనుగోలు చేస్తుందో చెప్పాలన్నారు. సాక్ష్యాధారాలతో అభ్యంతరాలు చెప్పినా రజిని నామినేషన్ ఆమోదంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు.

- బొల్లా బ్రహ్మనాయుడు నామినేషన్‌లో తప్పుడు అఫిడివిట్ దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారికి గురువారం ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఆమోదించారని న్యాయవాదులు మూర్తి, గోపినాథ్, జైభారత్ అభ్యర్థి చిరంజీవినాయక్ తెలిపారు. విద్యార్హత విషయంలో తేడాలు ఉన్నాయని, కేసుల అంశాలు ప్రస్తావించలేదని తెలిపారు. బొల్లా నిశాని అయితే ఇంగ్లీష్‌లో ఎలా సంతకం చేశారని, సంతకం నేర్చుకొని ఉంటే న్యాయమూర్తి చేత అఫిడవిట్ చేసి ఆర్వోకు నామినేషన్ పత్రంతో అందించాల న్నారు. వీటిపై త్వరలో హైకోర్టులో పిటీషన్ వేస్తామని తెలిపారు.

ఇద్దరు ఎన్నికల పరిశీలకులు..



నీరజ్ కుమార్ కార్తీక

గుంటూరు సిటీ, ఏప్రిల్ 26: జిల్లా లోని ఏడు నియోజకవర్గా లకు కేంద్ర ఎన్నికల కమి షన్ ఇరువురు పరిశీలకులను శుక్రవారం నియమించింది. ఐఏఎస్ నీరజ్‌కుమార్ మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులుగా నియమితులయ్యారు. ఎన్నికల ఏజంట్లకు, ఓటర్లకు నీరజ్ కుమార్ ఫోన్ నెంబరు 9154882127లో అందు బాటులో ఉంటారని పత్రికా ప్రకటనలో తెలిపారు. మరో ఐఏఎస్ కార్తీక తాడికొం డ, ప్రత్తిపాడు, గుంటూరు వెస్ట్, గుంటూరు ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులుగా వచ్చారు. ఆమె ఫోన్ నెంబరు 9154882128లో అందుబాటులో ఉంటారు.

నేడు గుంటూరులో 3కే రన్

- పాల్గొనున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా ఓటు వినియోగించుకుంటున్న యువతకు అవగాహన కల్పించడానికి నగరంలో శనివారం 3కే రన్ నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిధి గా రాష్ట్ర చీఫ్ ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా, విశిష్ట అతిధులుగా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జేసీ రాజకుమారి, ఎస్పీ తుషార్ డూడి, కమిషనర్ చేకూరి కీర్తి, లెట్స్ ఓట్, నేషనల్ కన్వీనర్ ప్రొఫెసర్ కే సుబ్బరంగయ్య పాల్గొంటారని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. 3కే రన్ ఉదయం 6 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం వద్ద ప్రారంభమై మదర్ థెరిస్సా విగ్రహం, కొరిటెపాడు, ఐటీసీ హోటల్ మీదగా తిరిగి స్టేడియం వద్దకు చేరుకుంటుందని అధికారులు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్

ఓటుతోనే గుణపాఠం చెబుదాం

- గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

పెదనందిపాడు, ఏప్రిల్ 26: సీఎం జగన్మోహన్‌రెడ్డి అరాచకాలకు ప్రజలు ఓటుతోనే గుణపాఠం చెప్పాలని గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని నాగభైరువారిపాలెం, జరుగులవారిపాలెం, ఉప్పలపాడు, పరిటాలవారిపాలెం, అన్నవరం, పాలపర్రు, రాజుపాలెం, ఏబీపాలెం, జీజీపాలెం, రావిపాడు, గోగులమూడి, కట్రపాడు, పుసులూరు, పమిడివారిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక అధ్యయనం చేశామని, టీడీపీ అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తామన్నారు. తాగు, సాగునీటి సమస్య, పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే టీడీపీ ధ్యేయమన్నారు. ఈ ప్రాంతంలో రైతులు పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. నియోజకవర్గాల్లో నిరుద్యోగులకు వృత్తి నైపుణ్యానికి ప్రత్యేక శిక్షణ ఇప్పించి, పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ల్యాండ్ టైటిలింగ్ పేరుతో రైతుల పొలాల్లో హద్దు రాళ్ళపై జగన్ ఫొటోలు అంటించారని, ప్రజల ఆస్థిపై తన ఫొటో ముద్ర వేసుకోవడమేనా ప్రజా సంక్షేమం అని ప్రశ్నించారు. ప్రతి పేదవారిని లక్షాధికారిని చేయడమే చంద్రబాబు కల అని అన్నారు. అభివృద్ధికి పట్టంకట్టే కూటమి అభ్యర్థులకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు.

ప్రత్తిపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు తమ ఆస్తులను కుదవపెట్టి పక్క రాష్ట్రాలకు వెళ్ళి బతకాల్సి వస్తుందన్నారు. ఈ దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడి సంక్షేమ పాలనకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ మాట్లాడుతూ వైసీపీ అరాచకాలకు విసుగుచెంది వ్యతిరేకంగా ఉన్న మాలాంటి ఎందరో నాయకులు ప్రజాసంక్షేమం గురించి ఆలోచించి టీడీపీ వైపు అడుగులు వేశామని, అభివృద్ధి జరగాలంటే కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జనసేన, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్లు కొర్రపాటి నాగేశ్వరరావు, పరాంకుశ శ్రీనివాసరావు, కన్నా రవిదేవరాజు, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ, టీడీపీ మైనార్టీ నాయకులు షేక్ ముజీబ్, సర్పంచ్ దండా శాంతకుమారి, కమ్మ నాగమల్లేశ్వరరావు, రావిపాటి కృష్ణప్రసాద్, ఎంపీటీసీ బొగ్గవరపు లక్ష్మీతిరుపతమ్మ, గ్రామపార్టీ అధ్యక్షులు బొగ్గవరపు చంద్రశేఖర్, నంగినేని రోశయ్య, పెంట్యాల శ్రీధర్, జాగర్లమూడి శ్రీనివాసరావు, పొన్నం నాగేశ్వరరావు, జంపని హనుమంతరావు, ఎన్నారై టీడీపీ లాస్‌ఏంజెల్స్ అధ్యక్షుడు ఆళ్ళ వెంకట్, నాయకులు పోపూరి రామచంద్రరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, మదమంచి వాసు, కుర్రి సుబ్బారెడ్డి, నిడుమోలు శ్రీనివాసరావు, కమ్మ వీరయ్య, దండా వీరయ్య, యాగంటి బొల్లారావు, గేరా వంశీ, ధూళిపాళ్ళ మోహనరావు, తుమ్మల కనకయ్యచౌదరి, రావి శివరామకృష్ణయ్య, ఆళ్ళ రాజారావు, చంద్రయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజధానిపై జగన్ మూడు ముక్కలాట

- కర్నూలు, విశాఖలో ఒక్క ఇటుకా పేర్చలేదు
- అమరావతి పనులు కొనసాగివుంటే లక్ష మందికి ఉపాధి
- అధికారంలోకి రాగానే అమరావతి పనులు ప్రారంభిస్తాం
- మంగళగిరి ఎన్నికల ప్రచారంలో నారా లోకేశ్

మంగళగిరి సిటీ, ఏప్రిల్26: అసెంబ్లీ సాక్షిగా 2014లో జగన్ మాట్లాడుతూ.. అమరావతికే సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ప్రకటించి.. అధికారంలోకి రాగానే మూడు రాజధానులను తెరమీదకు తీసుకువచ్చి అమరావతి విషయంలో మాటతప్పి మడమ తిప్పారని' టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని కృష్ణాయపాలెం ప్రాంతవాసులతో లోకేశ్ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అమరావతి పనులను కొనసాగించివుంటే లక్షమందికి ఉపాధి అవకాశాలు లభించేవన్నారు. మూడు రాజధానుల పేరిట మూడు ముక్కలాటకు తెరతీసి రాష్ట్ర ప్రజలను దారుణంగా వంచించారన్నారు. కర్నూలు, విశాఖపట్నంలో కనీసం ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. రాజధాని ఇక్కడే వుంటుంది, జగన్‌ను నేను ఒప్పిస్తానని చెప్పిన ఆళ్ల రామకృష్ణారెడ్డి మూడు రాజధానులకు మద్దతుగా ఓటు వేశారని చెప్పారు. మూడు రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కృష్ణాయపాలెం దళిత రైతులు ఆందోళన చేస్తే మాదిగలపై ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయించి జైలుకు పంపారని, ఆ రైతులకు టీడీపీ అండగా నిలిచిందని గుర్తుచేశారు. అమరావతిలో ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఎం, విట్ యూనివర్సిటీలలో వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆగిపోయిన అమరావతి పనులను ప్రారంభించి ఈ ప్రాంతంలోనే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని లోకేశ్ స్పష్టం చేశారు.



కృష్ణాయపాలెం గ్రామస్థులతో మాట్లాడుతున్న నారా లోకేశ్



సమస్యలపై లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణాయపాలెం వాసులు

పాతికేళ్ల అభివృద్ధిని విస్మరించారు

పాతికేళ్లుగా మంగళగిరి నియోజకవర్గంలో గెలిచినోళ్లు ఈ ప్రాంత అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని లోకేశ్ విమర్శించారు. తాను ఇక్కడి ఓడినప్పటికీ ప్రజల మనస్సు గెలవాలని భావించి సొంత నిధులతో 29 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానని తెలిపారు. గత అయిదేళ్ల నుంచి తాను చేసిన సంక్షేమంలో గెలిచిన వాళ్లు కనీసం పది శాతమైనా చేశారా అని ప్రశ్నించారు. అబద్ధాలను చెప్పడంలో సీఎం జగన్‌తోపాటు ఆళ్ల రామకృష్ణారెడ్డి వంటి సామంతులు మాస్టర్స్ డిగ్రీ చేశారన్నారు. మంగళగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నియోజకవర్గంలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణంతోపాటు ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామని, కృష్ణాయపాలెం నుంచి పెనుమాక వెళ్లే బ్రిడ్జిని పునర్నిర్మాస్తామని, అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా మంగళగిరి నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతానన్నారు.



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న నారా లోకేశ్

సమస్యలపై లోకేశ్‌కు వినతి

కృష్ణాయపాలెం వాసులు తమ సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, దళిత శ్మశానవాటికకు వెళ్లే రహదారి, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, ఇళ్లులేని వారికి ఇళ్ల పట్టాలు, ఇళ్లు నిర్మించాలని, జాతీయ రహదారికి భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని, పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని, కమ్యూనిటీ హాలు నిర్మించాలని, విద్యార్థులకు పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం అమలు చేయాలని, చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలపై లోకేశ్ స్పందిస్తూ ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీటిని అందిస్తామని, దామాషా ప్రకారం శ్మశానాలకు స్థలాలు కేటాయిస్తామని, నిరుపేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వడంతోపాటు ప్రభుత్వ స్థలాల్లో నివాసం వుంటున్న వారికి శాశ్వత పట్టాలిస్తామని, రైతులను ఆదుకుంటామని, మద్యం నియంత్రణకు చర్యలు తీసుకుంటామని, లారీలపై గ్రీన్ ట్యాక్స్ భారం తగ్గిస్తామని, పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం అమలు చేస్తామని, చదువుకున్న యువతకు అర్హతను బట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

రాష్ట్రంలో వైసీపీ పనైపోయింది

- కూటమి ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణదేవరాయలు
- డాక్టర్ అరవిందబాబుతో కలసి ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబు తదితరులు

రొంపిచర్ల, ఏప్రిల్ 26: రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయిందని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని మునమాక, విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం, సుబ్బయ్యపాలెం, తురుమెళ్ళ, ముత్తనపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబుతో కలసి శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐ ప్యాక్ సర్వేలన్నీ బోగస్ అన్నారు. ఆ సర్వేలతో ప్రజలను, ఎమ్మెల్యేలనే కాక ముఖ్యమంత్రిని కూడా మోసం చేస్తున్నారన్నారు. ఇటీవల నిర్వహించిన సిద్ధం సభలకు రూ.700 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి ప్రలోభాలతో జనాన్ని తరలిస్తున్నారన్నారు. తాను ఏనాడు వైసీపీని విమర్శించ లేదన్నారు. తనపై అనవసరంగా వక్రీకరించి రాతలు రాస్తున్నారని తెలిపారు. పల్నాడులో టీడీపీకి ఎక్కడ చూసినా జనం ప్రభంజనంలా వస్తున్నారన్నారు. ఆ పార్టీ మాదిరిగా ఎక్కడా ప్రలోభాలు పెట్టలేదన్నారు. సోషల్ మీడియాలో తనపై చేస్తున్న అసత్య ప్రచారాలను ఘాటుగా ఖండించారు. పల్నాడు ప్రజల ఆశీస్సులతో ముందుకు వెళ్తున్నానన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో గాలి టీడీపీ వైపు తిరిగిందని, ఎక్కడ చూసినా సభలకు, కార్యక్రమలకు స్వచ్ఛందంగా ప్రజలు తరలి వస్తున్నారన్నారు. రైతు పంట కోసం ఏ విధంగా కష్టపడతాడో పల్నాడు కోసం, ప్రజల కోసం తాను కష్టపడుతున్నానని తెలిపారు. ప్రజలు తమ పార్టీ వైపే ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల వరకు ప్రతి టీడీపీ కార్యకర్త, నాయకుడు కష్టపడుతూ ఉండాలన్నారు.

అరవింద బాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ఎంపీ, ఏడు అసెంబ్లీ స్థానాలు గెలుస్తామని తెలిపారు. వైసీపీ నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా తమ విజయం తథ్యమన్నారు. నరసరావుపేట అసెంబ్లీ సీటు గెలిచి చంద్రబాబుకు కానుకగా ఇస్తానన్నారు. నరసరావుపేట నియోజక వర్గంలో ప్రతి చోట టీడీపీకి మెజార్టీ వస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ సయ్యద్ జిలానీ, బీజేపీ నాయకులు రామకృష్ణ, గోనుగుంట్ల కోటేశ్వరరావు, వేల్పుల సింహాద్రి యాదవ్, పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, రామ్మూర్తి, ఇంటూరి ప్రసాదు, వేణు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

- ఒక గంట ముందుగా కేంద్రాలకు రావాలి
- గుంటూరు నగరంలో 14, తెనాలిలో 3 పరీక్షా కేంద్రాలు
- జిల్లా కో-ఆర్డినేటర్ శేఖర్ వెల్లడి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 26:పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్ష శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరగనుంది. విద్యార్థులు కేంద్రాలకు కనీసం ఒక గంట ముందుగా చేరుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ టి.శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలిసెట్ కోసం జిల్లాలో మొత్తం 14 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గుంటూరు నగరంలో 11 కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఆయా కేంద్రాలలో 4,628 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. అలాగే మరో వైపు తెనాలిలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఆయా కేంద్రాల నుంచి 772 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

అక్రమ నిర్బంధం ఘటనలో

పోలీసులకు సమన్లు

చుండూరు ఏప్రిల్ 26 : జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి, చుండూరుకు చెందిన గూదేటి బాలకోటిరెడ్డిని అక్రమంగా నిర్బంధించారన్న కేసులో తెనాలి రెండవ అదనపు కోర్టు శుక్రవారం పోలీసులకు సమన్లు జారీచేశారు. 2023 జూలై 2న అప్పటి చుండూరు ఎస్ఐ నవీన్‌కుమార్ బాలకోటిరెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదుచేసి వివిధ పోలీస్‌స్టేషన్‌లు తిప్పుతూ అతన్ని చిత్ర హింసలకు గురిచేశారు. దీనిపై కోటిరెడ్డి ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కోర్టు విచారణ అనంతరం అప్పటి చుండూరు సీఐ అంబటి రాజమోహన్, ఎస్ఐ నవీన్‌కుమార్, అమర్తలూరు, కొల్లూరు, భట్టిప్రోలు, నగరం ఎస్ఐలు సురేష్, గార్లపాటి రాజ్యలక్ష్మీ, అంబటి చంద్రశేఖర్, డి.రామకృష్ణలకు ఐపీసీ 365, 346, 324, 509 సెక్షన్ల కింద పోలీసు అధికారులకు సమన్లు జారీచేశారు.



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

ఎన్నికల్లో పోటీ చేసే అర్హత వైసీపీకి లేదు

- 1592 చేరుకున్న రైతుల ఆందోళనలు


తుళ్లూరు, ఏప్రిల్ 26: రాష్ట్ర రాజధానిని నాశనం చేద్దామనుకునే వైసీపీ వారికి ఓట్లు ఎలా వేస్తారని అమరావతి రాజధాని నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, మహిళలు రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 1592వ రోజుకు చేరుకున్నాయి. విజనరి రాష్ట్ర సీఎం అయితే భావి తరాల వారి భవిష్యత్ బంగారు బాట అవుతుందని స్పష్టం చేశారు. అప్పులుచేసి పాలించటం ఎవరైనా చేస్తారని, సీఎం కానవసరం లేదన్నారు. అభివృద్ధిచేసి పంపదను సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేసే వారే సీఎం కావాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో నిరసన దీక్షలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి.

నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద రూ.లక్ష స్వాధీనం

తెనాలి రూరల్, ఏప్రిల్ 26: నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద ఓ కారులో రూ.లక్ష స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో దుగ్గిరాల మీదుగా తెనాలి వైపు వస్తున్న ఓ కారును నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేయగా ఎటువంటి బిల్లులు లేకుండా ఉన్న రూ. లక్ష నగదును గుర్తించి సీజ్‌చేసినట్లు రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

సత్యా ఎలక్ట్రానిక్ షోరూం ప్రారంభం

గుంటూరు, ఏప్రిల్ 26: గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో పాత ఇన్‌కంటాక్స్ కార్యాలయ భవనంలో సత్యా ఎలక్ట్రానిక్ గృహోపకరణాల షోరూం ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జాన్సన్ అసారియా, ప్రాపర్టీ ఓనర్ శ్రీనివాస్‌లు శుక్రవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యతమైన, నమ్మకమైన ఎలక్ట్రానిక్ గృహోపకరణాలను అందించే సత్యా సంస్థలో అందరికి అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు, ఎల్ఈడీ టీవీలతో పాటు ఇతర ఎలక్ట్రానిక్ గృహోపకరణాలన్నీ ఒకే చోట అందుబాటులో ఉంటాయన్నారు. అన్ని కంపెనీల ఎలక్ట్రానిక్ గృహోపకరణాలను నాణ్యమైన, నమ్మకమైన వస్తువులతో పాటు అందుబాటు ధరల్లో అందించటమే సత్యా సంస్థ లక్ష్యమన్నారు. ప్రతి రూ.20 వేల పైన కొనుగోలుపై బంగారు నాణెం ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. అంతేగాక వివిధ రకాల బ్రాండ్లకు చెందిన మొబైల్ ఫోన్‌ల నుంచి మిక్సీలు, వాషింగ్ మెషీన్లు, ఎయిర్ కూలర్లు ఒకే షోరూంలో అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో సత్యా సంస్థ జనరల్ మేనేజర్ సెందిల్ కుమార్ పలువురు సంస్థ సిబ్బంది ఉన్నారు.



షోరూంను ప్రారంభిస్తున్న ఎండీ జాన్సన్ అసారియా, ప్రాపర్టీ ఓనర్ శ్రీనివాస్



గుంటూరులోని సత్యా షోరూం

62,153 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 59,655 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 62,153 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 42,701 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	18000
నెంబరు. 5	10000	15500
273	12000	14000
341	8000	17000
4884	11000	13000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	8000	17000
దేవనూరు డీలక్స్	8500	15500
తెల్లకాయలు	5000	11000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147,156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00



బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లను అభ్యర్థుల సమక్షంలో పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల పార్లమెంట్‌లో ఏడు నామినేషన్లు తిరస్కరణ

బాపట్ల,ఏప్రిల్ 26 : బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గానికి దాఖలైన నామినేషన్ల పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా శుక్రవారం చేపట్టారు. మొత్తం 20 మంది అభ్యర్థులలో ముగ్గురికి సంబంధించిన ఏడు నామినేషన్ పత్రాలు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 17 మంది అభ్యర్థులకు చెందిన 27 నామినేషన్లు అర్హత ఉన్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఏఆర్‌వోలు, ఆయా పార్టీల అభ్యర్థులు పాల్గొన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గంలో 5 నామినేషన్లు..

బాపట్ల, ఏప్రిల్ 26 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ పరిశీలన కార్యక్రమాన్ని బాపట్ల అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, ఏఆర్‌వోలు, సిబ్బందితో కలిసి శుక్రవారం చేపట్టారు. అభ్యర్థులవారిగా పిలిచి నామినేషన్ పత్రాలు పరిశీలించారు. వైసీపీ నుంచి డమ్మి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కోన రమాదేవి, టీడీపీ నుంచి డమ్మి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన వేగేశన హరికుమారి నామినేషన్లను తిరస్కరించారు. నవతరం పార్టీ నుంచి నామినేషన్ వేసిన షేక్ కరీం, కాంగ్రెస్ అభ్యర్థి గంటా నవీన్, జై మహభారత్ అభ్యర్థి అక్కల రాంబాబురెడ్డి నామినేషన్లను తిరస్కరించినట్లు ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థి పద్మభూషణ శర్మ వివి కస్తూరి నామినేషన్‌ను మాత్రం పెండింగ్‌లో పెట్టారు. మొత్తం 5 నామినేషన్లు తిరస్కరించగా ఒక్కనామినేషన్ పెండింగ్‌లో పెట్టారు. మిగిలిన నామినేషన్లు మొత్తం ఆమోదించారు.

రేపల్లెలో ఐదు నామినేషన్లు..

రేపల్లె, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వివిధ పార్టీల నుంచి స్వతంత్ర అభ్యర్థుల నుంచి 37నామినేషన్లు రాగా ఐదు నామినేషన్లు తిరస్కరించారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేలా షారోన్ తెలిపారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనగాని మంజుల రెం డు నామినేషన్లు, ఈవూరి సృజన్ రెండు నామినేషన్లు, మోపిదేవి రాగమౌనేష్ ఒక నామినేషన్‌ను తిరస్కరించినట్లు తెలిపారు. 17 మంది అభ్యర్థులు, 27 నామినేషన్లు ఆమోదించారని తెలిపారు.

వేమూరులో రెండు నామినేషన్లు..

వేమూరు, ఏప్రిల్ 26 : వేమూరు అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ లో భాగంగా శుక్రవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి వసంతరాయుడు తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 17మంది సభ్యులు 24 నామినేషన్లు దాఖలు చేశారు. వాటి పరిశీలనలో ప్రత్యామ్నాయంగా దాఖలు చేసిన రెండు నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు. 16 మందికి సంబంధించిన 22 నామినేషన్లు నిబంధనలకు అనుకూలంగా ఉన్నట్లుగా పేర్కొన్నారు. అనుమతించబడిన నా మినేషన్ దారుల వివరాలను తెలిపారు. వైసీపీ నుంచి వరికూటి అశోక్‌బాబు, టీడీపీ నుంచి నక్కా ఆనందబాబు, గొరికపూడి స్టీవెన్.. బీఎస్పీ, బూరుగ సుబ్బారావు...కాంగ్రెస్ పార్టీ, కొత్త పోగు విజయకుమార్...పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తదితరులు నామినేషన్లను అనుమతించారు.

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలుస్తారు

● బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు

బాపట్ల,ఏప్రిల్ 26 : రక్తదానం చేయటం వలన ప్రాణదాతలుగా నిలుస్తారని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం రేపల్లె రెడ్ క్రాస్ యూనిట్‌వారు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ముప్పలనేని ప్రారంభించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలన్నారు. ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి విద్యార్థి దశ నుంచి మానవతా విలువలు కలిగి ఎదుటివారికి సహాయం చేయకలిగే వ్యక్తిత్వం కలిగియుండాలన్నారు. శిబిరంలో 60 మంది విద్యార్థులు రక్తదానం చేయటానికి ముందుకు రావటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు దొప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్‌కుమార్, కరస్పాండెంట్ కొమ్మినేని హరిపద్మప్రసాద్, కోశాధికారి తాళ్ళూరి రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఐ.హరిత, ఎన్‌సీసీ అధికారి ఓ.శ్రీదేవి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బి.ఎస్. నారాయణభట్టు, టి.ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ వీరరాఘవయ్య, బ్లడ్ బ్యాంక్ సభ్యులు, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు పంపిణీ



విద్యార్థిని బి.పావని సాయికి ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న మాస్టర్‌మైండ్స్ అధ్యాపకుడు వీరాంజనేయరెడ్డి

బాపట్ల, ఏప్రిల్ 26 : పట్టణంలోని అశోక కన్వెన్షన్ హాలులో శుక్రవారం మాస్టర్‌మైండ్స్ ఆధ్వర్యంలో 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ అధ్యాపకుడు వీరాంజనేయరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని నగదు పురస్కారాలు అందజేసి భవిష్యత్తులో ఏవిధంగా ముందుకుపోవాలి, ఏ కోర్సులను ఎంచుకోవాలి అనే అంశాలపై వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలను సాకారం చేసే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ అడ్వయిజర్ ముట్టుపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి పాలనతోనే అభివృద్ధి

● జగన్ అరాచక పాలనకు బుద్ధి చెప్పండి
● ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి ఆనందబాబు



కోడిపర్రులో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఆనందబాబు

వేమూరు, ఏప్రిల్ 26: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కాంక్షించి తెలుగుదేశం జనసేన, బీజేపీ పార్టీలు కూటమిగా ఏర్ప డి రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. శుక్రవారం సాయం త్రం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అబ్బనగూడవల్లి, పెనుమర్రు, కోడిపర్రు, బలిజేపల్లి గ్రామాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికెళ్ళి మ్యానిఫెస్టో కరపత్రాలను ఓటర్లకు అందించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు హారతులు ఇచ్చి గుమ్మడి కాయలతో దిష్టి తీసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న ప్రజావ్యతిరేక విధానాలు అవినీతి అక్రమాలను ప్రతి ఒక్కరూ గ్రహించి మార్పు కోరాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అన్ని వర్గాలకు సముచిత న్యా యం జరిగే విధంగా ఉమ్మడి మ్యానిఫెస్టో తీసుకువస్తామన్నారు. తద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలతో పాటు మహిళలకు మరింతగా ఆర్థిక పరిపుష్టిని కల్పించేందుకు అనేక పథకాలను అమల్లోకి తీసుకువస్తామని అన్నారు. వేమూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు గ్రామాల రైతులకు చెందిన దాదాపు 6వేల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా పోత్తిపోతల పథక నిర్మాణాన్ని తాడిగిరిపాడు వద్ద ఎనిమిది కోట్ల వ్యయంతో చేపడితే గత ఎన్నికల ముందు 50శాతం పైగా నిర్మాణం పూర్తి చేసుకుని ఎన్నికల కోడ్ వల్ల నిర్మాణం పని అర్థంతరంగా నిలిచిపోయింది. నిర్మాణం పని పూర్తి చేయాలం టూ స్థానిక ఎమ్మెల్యే మంత్రిగా ఉన్న మేరుగు నాగార్జునను రైతులు కోరగా టీడీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టును పూర్తి చేసేది లేదంటూ రైతులకు చెప్పిన సమాధానం ద్వారా వైసీపీ ప్రభుత్వానికి రైతుపై ఎంతటి ప్రేమ ఉన్నదో రైతులు తెలుసుకోవాలన్నారు. సొంత భూమికి సంబంధించిన పట్టా పుస్తకంపై ముఖ్యమంత్రి బొమ్మను వేసుకోవడం ద్వారా భవిష్యత్తులో రైతుకు నష్టం కలిగించే ఆలోచనతోనే జగన్ ఈ ఆలోచనకు పూనుకున్నారన్న విషయం కూడా రైతులు గ్రహించాలన్నారు. కేవలం అధికార దాహంతో తనపై శిక్ష పడకుండా ఉండేందుకు తహతహలాడుతున్న జగనకు అన్ని వర్గాల వారు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు. జగన్‌ను తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని, మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కూటమి అభ్య ర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమే కూటమి ఏర్పడిందన్న విషయం గ్రహించాలన్నారు.

రాజధాని లేని రాష్ట్రం దేశంలో ఎక్కడా లేదని, దుర్మార్గమైన ఆలోచనతో జగన్ రాజధాని లేకుండా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే అమరావతిని రాజధానిగా కొనసాగించడం జరుగుతుందని తద్వారా ఈ ప్రాంత రైతు ప్రజానీకం ఎంతో అభివృద్ధికి నోచుకుంటారన్నారు. తనతో పాటు బాపట్ల ఎంపీ అభ్యర్థిగా నిలబడిన కృష్ణప్రసాదును గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులు, మహిళలు, యువత జనసేన, టీడీపీ శ్రేణులతో చర్చించారు. ప్రతి ఒక్కరూ సమష్టిగా ఎన్నికల్లో పని చేయాలని విజయం సాధించుకునేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ విజయబాబు, ఊసా రాజేష్, దండే వెంకట సుబ్బారావు, మన్నే పసి, దొప్పలపూడి సుధాకర్, కొండిశెట్టి సుబ్బారావు, డాక్టర్ జయలక్ష్మీ, బి.వెంకటేశ్వర్లు, కోగంటి విశ్వం, పరిశ సాంబశివరావు, డేనియల్ సువర్ణబాబు నాయకులు పాల్గొన్నారు.



అబ్బనగూడవల్లిలో మహిళలతో మాట్లాడుతున్న ఆనందబాబు



హారతులతో ఆనందబాబుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

రైతు సంక్షేమానికి ఎన్డీయే కూటమిని బలపరచాలి

● రాష్ట్రాభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యం
● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజలకు అభి వాదం చేస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

చెరుకుపల్లి, ఏప్రిల్ 26: రైతు సంక్షేమం కావాలంటే ఏన్‌డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుంచాలవారిపాలెం, రాంబొట్లవారిపాలెం, కావూరు గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో జరిగిన రోడ్‌షోలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సీమలు అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని ఆయన అన్నారు. సాగునీటి కాల్వలను ఆధునీకరణ చేసింది చంద్రబాబు అని పేర్కొన్నారు. మహిళలకు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత, మహిళల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. ప్రతి ఒక్కరూ చంద్రబాబును ముఖ్యమంత్రి గా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందని ఆయన అన్నారు. చంద్రబాబు వస్తేనే యువతకు భవితవ్యం ఉంటుందని ఆయన తెలిపారు. టీడీపీ ప్రభుత్వం వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్ర యాణం కల్పిస్తామన్నారు. ప్రజలు చంద్రబాబు ప్రకటిస్తున్న సూపర్ సిక్స్ పథకాలను గుర్తుంచుకుని ఓటు వెయ్యాలని ఆయ న కోరారు. తొలుత కుంచాలవారిపాలెంలో మహిళలు అనగానికి హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. కుంచాలవారిపాలెం, రాంబొట్లవారిపాలెం, కావూరు గ్రామాల్లో పలు దేవాలయాలు, అంబే ద్కర్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కావూరులో రైతులు ట్రాక్టర్లతో అనగానికి భారీ స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిట్టు శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవి రెడ్డి, కుంచల పెద్దిరెడ్డి, మల్లాది రామకృష్ణ, పూషడపు కుమారస్వామి, ముఖమాటం రాధాకృష్ణమూర్తి, ఉప్పాల సాంబశివరావు, తాతా ఏడుకొండలు, గూడపాటి శ్రీనివాసరావు, కేసన రామకృష్ణ, షేక్ రఫీ, రవికుమార్, మండవ తాతాజీ, బుల్లిబాబు, చుక్కా కోటయ్య, జనసేన పార్టీ నాయకులు మత్తి భాస్కరరావు పాల్గొన్నారు.



రాంబొట్లవారిపాలెంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు హారతులు ఇస్తున్న మహిళలు



కుంచాలవారిపాలెం ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రసాద్

సత్యసాయి ఆలయంలో హనుమాన్ మండలి దీక్ష

కర్లపాలెం, ఏప్రిల్ 26 : కర్లపాలెంలోని శ్రీ సత్యసాయిబాబా ఆలయంలో హనుమాన్ మండలి దీక్ష పూజలను 5వరోజు ఘనంగా నిర్వహించారు. హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో పబ్బిశెట్టి సువర్చలాదేవి, చేబ్రోలు విజయలక్ష్మి, పారెపల్లి విజయలక్ష్మి, రమాదేవి, రాజేశ్వరి, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం సీసాలు తీసుకెళుతున్న వ్యక్తి అరెస్టు

కొల్లూరు, ఏప్రిల్ 26: వేమూరు మండలం బలిజేపల్లి గ్రామానికి చెందిన బెల్లంకొండ శివయ్య తన ద్విచక్ర వాహనంపై 40 మద్యం సీసాలు తీసుకు వెళుతుండగా వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎస్‌బి రవీంద్రారెడ్డి తెలిపారు. కొల్లూరులోని మద్యం దుకాణం నుంచి కొనుగోలు చేసి అతని గ్రామంలో మద్యం అమ్మకాలు చేస్తున్నట్టుగా తెలిపారు.

పద్యరచయిత్రి సీతారావమ్మకు మాతృవందనం పురస్కారం

బాపట్ల, ఏప్రిల్ 26 : బాపట్లకు చెందిన ప్రముఖ రచయిత్రి ముదిగొండ సీతారావమ్మకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి మాతృవందనం పురస్కారం లభించింది. ఈ ఏడాది పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, సితాస్‌చారిటుబల్‌ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో సీతారావమ్మను ఎంపిక చేశారు. పురస్కారాన్ని అక్షరయాన్ బాపట్ల జిల్లా తరుపున కవయిత్రి పత్తిపాటి సుభాషిణి నివాసం వద్ద శుక్రవారం అందజేశారు. సీతారావమ్మ 6 దశాబ్దాల సాహిత్య సేద్యంలో అనేక అవధానాలలో పృచ్ఛకురాలిగా ఉన్నారని మూడు పదుల శతకాలను రచించారని, అనేక పురస్కారాలు అందుకున్నారని కొనియాడారు. పురస్కారగ్రహీత పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, సీతాస్ చారిటుబల్‌ట్రస్ట్‌వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు, సాహితీవేత్త మల్లికార్జునరావు, రాజేశ్వరి, డాక్టర్ శ్రీనివాస్, బాలకాత్యాయని, తేజస్వి, పణిదూర్జటి తదితరులు పాల్గొని సీతారావమ్మ సేవలను కొనియాడారు.

యువత విద్యతోపాటు క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలి

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 26 : మండలపరిధిలోని చందోలు గ్రామపంచాయతీలోని యువత వేసవి అటవిడుపు సందర్భంగా చందోలుగ్రామ టీడీపీ యువనాయకులు సయ్యద్ నిజాం క్రికెట్ కిట్‌లను అందజేశారు. ఈసందర్భంగా చందోలు యువత సయ్యద్ నిజాంను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో మండల మైనార్టీనాయకులు షేక్. మీరా, పలువురు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌వైర్లు తగిలి ట్రాక్టర్‌లో గడ్డి దగ్ధం

బాపట్ల, ఏప్రిల్ 26 : మండలంలోని మూలపాలెం గ్రామానికి చెందిన మిక్కిలిపాల్ రెండు ఎకరాల గడ్డిని ట్రాక్టర్‌లో లోడ్ చేసి జమ్ములపాలెం వెళుతుండగా రైలుపేట పార్క్ దగ్గర విద్యుత్ వైర్లు తగిలి మంటలు రేగాయి. స్థానికులు కేకలు పెట్టటంతో డ్రైవర్ చాకచక్యంగా గడ్డిని కిందకు వదిలేసి ట్రాక్టర్ ముందుకు పోనిచ్చాడు. దీంతో గడ్డి దగ్ధం అవుతుండగా ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేసి ప్రమాదం జరగకుండా చూశారు. సంఘటనలో 20వేల రూపాయల విలువైన గడ్డి దగ్ధమైందని ఆయన తెలిపారు.

సీపీఐ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

బాపట్ల, ఏప్రిల్ 26 : సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల మేనీఫెస్టోను జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌నాయకులు జెబి.శ్రీధర్, మామిడిబత్తుల అశోక్, శ్రీనివాసరావు, మామిడి బత్తుల గని పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం : తమ్మా శివారెడ్డి

చుండూరు ఏప్రిల్ 26: తెలుగుదేశం పాలనలోనే రాష్ట్రం అన్ని రకాలుగా సుభిక్షంగా ఉంటుందని టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి అన్నారు. శుక్రవారం సూపర్-6 పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాల జగన్ పాలనలో విద్వేషాలు, అరాచకాలు, దోపిడిలే సర్వస్వంగా మారిందని, తిరిగి టీడీపీ పాలన వస్తేనే రాష్ట్రం పూర్వ వైభవాన్ని సంతరించుకోగలదని తెలిపారు. పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, అయ్యప్పరెడ్డి, జాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

అమృతలూరు, ఏప్రిల్ 26: పులివర్తి వాసు స్మారక జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఈనెల 28 నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో జరిగే శ్రీగణేష్ ఎంటర్ ప్రైజెస్, ఆలపాడు ప్రథమ బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి పులి వర్తి వాసు జ్ఞాపకార్థం కుమారుడు పృథ్వీ, రూ.15 వేలు, మూడో బహుమతి పెదపూడి సలోమి జ్ఞాపకార్థం కుమారుడు నాగేశ్వరరావు రూ.10 వేలు అందించనున్నట్లు చెప్పారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతిగా రూ.5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 8498935065, 6301029319, 7981641714 సంప్రదించాలన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

బాపట్ల, ఏప్రిల్ 26 : పట్టణంలోని మూర్తిరక్షణ్‌నగర్‌కు చెందిన పిల్లి మౌనికను 8 ఏళ్ళ క్రితం కోడిపర్రు గ్రామానికి చెందిన ధనవర్ధనరాజుకిచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత అధిక కట్నం కోసం కొడుతూ వేధింపులకు గురి చేస్తున్నాడని భార్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎస్సై రజాక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ వేడుకలు

కర్లపాలెం, ఏప్రిల్ 26 : కర్లపాలెం మండలంలోని యాజలి పంచాయతీ అంగన్‌వాడీ-2 కేంద్రంలో గ్రాడ్యుయేషన్‌డే వేడుకలను శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో లక్ష్మీపార్వతి, సూపర్‌వైజర్ సౌజన్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



సజ్జావారిపాలెంలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

ఎన్డీయే కూటమి గెలుపునకు కృషి చేయాలి

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఏప్రిల్ 26: ప్రతి కార్యకర్త ఏన్‌డీఏ కూటమి గెలుపున కు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం నగరం మండలం సజ్జావారిపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని అనగాని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో సజ్జావారిపాలెంలో సీసీ రహదారులు, ప్రధాన రహదారులు అభివృద్ధి చేశారన్నారు. తాగునీటి సమస్య లేకుండా మినీ వాటర్‌స్కీమ్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందించామని జగన్‌రెడ్డి ఐదేళ్ళ పరిపాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలా సర్వనాశనం చేశారన్నారు. ప్రతి కార్యకర్త 20రోజులు కష్ట పడి పనిచేసి నాకు అండగా నిలిచి గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఉల్లిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు గోగినేని సుధీర్‌కు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నగరం పార్టీ అధ్యక్షుడు చింతల సుబ్బారావు, టీడీపీ నాయకులు దండమూడి ధరణి కుమార్, నాగళ్ళ హరిబాబు,కొత్త దుర్గాప్రసాద్, నాగమల్లి, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ పాల్గొన్నారు.

విచారణ నివేదిక ఎస్పీ కార్యాలయంలో...!

బాపట్ల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతను ఎస్‌ఐ నాగశివారెడ్డి దూషించారనే ఫిర్యాదుకు సంబంధించి విచారణ పూర్తి చేసిన బాపట్ల డీఎస్పీ ఆ నివేదికను ఎస్పీ కార్యాలయంలో గురువారమే అందజేసినట్లు తెలిసింది. ఈనెల 23న పర్చూరు ఆర్వో కార్యాలయం లోపలకి ప్రవేశం విషయంలో టీడీపీ పర్చూరు మండల పార్టీ అధ్యక్షుడిని ఎస్‌ఐ నాగశివారెడ్డి తిట్టారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫోన్‌లో ఫిర్యాదు అందించారు. దీనిపై స్పందించిన ఎస్పీ ఆర్వో కార్యాలయం వద్ద విధుల నుంచి సదరు ఎస్‌ఐని తప్పించడంతో పాటు ఆ ఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని బాపట్ల డీఎస్పీని అదే రోజు ఆదేశించారు. విచారణ పూర్తి చేసిన డీఎస్పీ సదరు నివేదికను ఎస్పీ కార్యాలయంలో అందించినట్లు సమాచారం. దాని ఆధారంగానే ఎస్‌ఐ నాగశివారెడ్డిపై తదుపరి చర్యలు ఉండనున్నాయి

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కార్యకర్తలు

వేమూరు, ఏప్రిల్ 26: వేమూరు మండలం కుచ్చెళ్ళపాడు గ్రామానికి చెందిన ఆరుగురు వైసీపీ సీనియర్ కార్యకర్తలు టీడీపీలో చేరారు. శుక్రవారం వేమూరు టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి, నక్కా ఆనందబాబు సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గాజుల సాంబశివరావు, గాజుల రామారావు, గాజుల శ్రీనివాసరావు, పెనుమూడి సాంబశివరావు, తాడికొండ మల్లికా ర్జునరావు, కంబులూరి శ్రీనివాసరావులకు ఆనందబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి అభినందించారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ బీసీ సెల్ నాయకులు తులం రమేష్‌బాబు, కుచ్చెళ్ళపాడు సర్పంచ్ గాజుల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



వేమూరులో ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

అధికారులు అలసత్వాన్ని వీడాలి

● పట్టణ వాసులకు తాగునీరు సమృద్ధిగా అందించాలి

రేపల్లె, ఏప్రిల్ 26: వేసవికాలంలో పట్టణ వాసులు తాగునీరు అందక నానా ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తక్షణమే ప్రజలకు తాగునీరు అందిం చాలని జనసేన పట్టణ అధ్యక్షుడు రాసంశెట్టి మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం అరవపల్లి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ వద్ద జనసే న, టీడీపీ ఆధ్వర్యంలో పట్టణ వాసులకు తాగునీరు అందించాలం టూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా పట్టణంలో మున్సిపల్ అధికారులు అరకొర గా తాగునీరు అందించటంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. 28, 1, 2,3 వార్డు ప్రజలకు 16, 17, 18, 19 వార్డులకు 24, 23 వార్డుల్లో తాగునీరు రాక ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు తాగునీరు అం దించాలంటూ పట్టణవాసులు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే అధికారులు నిర్లక్ష్యాన్నివీడి తాగునీరు అం దించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకులు ప్రజల కు తాగునీరు అందించలేకపోవటం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్డి లక్ష్మీజీ, దేవగిరి రంగా, పి.కోటేశ్వరరావు, సజ్జాప్రసాద్, జనసేన నాయకులు దేవగిరి శంకర్, భూపతి కోటి పాల్గొన్నారు.

ఆనందబాబు చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయండి

● మాజీ మంత్రి ఆనందబాబు తనయుడు డాక్టర్ అఖిలేశ్



చెన్నకేశవకాలనీలో ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ అఖిలేశ్

భట్టిప్రోలు, ఏప్రిల్ 26: మాజీ మంత్రి నక్కా ఆనందబాబు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తనయుడు డాక్టర్ నక్కా అఖిలేశ్ కోరారు. మండలంలోని వెల్లటూరు చెన్నకేశవకాలనీ, ఉత్తర దళితవాడ తదితర కాలనీల్లో శుక్రవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్లటూరు చెన్నకేశవకాలనీకి వెళ్ళేందుకు ప్రధాన రహదారితో పాటుగా అంతర్గత సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాలు నిర్మాణాలకు మాజీ మంత్రి ఆనందబాబు కృషి చేశారన్నారు. మాజీ మంత్రి ఆనందబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించినట్లయితే మరింత అభి వృద్ధి జరుగుతుందని అఖిలేశ్ స్పష్టం చేశారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వాకా శేషుబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మోటూరు పుణ్య శ్రీనివాసరావు, ఎంపీటీసీ వాకా వెంకటనారాయణ, పోతార్లంక రాజేష్, క్రాప రవికుమార్, టి.శ్రీను, లుక్కా శ్రీను, శర్మ, వేములపల్లి జగన్నాధరావు, ఎన్‌ఆర్‌ఐ టీడీపీ సభ్యులు పమిడి ముక్కల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల చైతన్యవేదిక రజితోత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

బాపట్ల, ఏప్రిల్ 26 : ఘంటసాల చైతన్యవేదిక రజితోత్సవ వేడుకలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించి అక్కడ జరిగిన సమావేశంలో వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈనెల 28వ తేదిన చీరాల ఘంటసాల విగ్రహం వద్ద, సాయంత్రం బాపట్ల ఘంటసాల విగ్రహం వద్ద ఈ వేడుకలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమానికి దర్శకులు డాక్టర్ సి.హెచ్.రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జీవి.బ్రహ్మం, శ్రీహరిరావు, రావూరి నరసింహవర్మ, జీవి.సుబ్రహ్మణ్యం, బిఎల్ వెంకట్రావు, కాళీదాసు, అంజిరెడ్డి, యిర్మియా, సుభాష్‌చంద్రబోస్, ఎన్ఎస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

120 ఆమోదం.. 26 తిరస్కరణ

- చీరాల కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ పెండింగ్
- ముగిసిన లోక్‌సభ, అసెంబ్లీ నామినేషన్ల స్క్రూట్నీ

నియోజకవర్గం	నామినేషన్లు వేసినవారు	ఆమోదం	తిరస్కరణ	పెండింగ్
బాపట్ల లోక్‌సభ	20	17	3	నిల్
బాపట్ల అసెంబ్లీ	31	25	5	1
రేపల్లె	18	15	3	-
వేమూరు	17	16	1	-
పర్చూరు	20	17	3	-
చీరాల	23	15	5	3
అద్దంకి	21	15	6	-

బాపట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల పరిశీలన కార్యక్రమం శుక్రవారం జరిగింది. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో లోక్‌సభ స్థానానికి, ఆయా నియోజకవర్గాల్లోని ఆర్వో కార్యాలయాల్లో అసెంబ్లీ స్థానాలకు సంబంధించి నామినేషన్ల స్క్రూట్నీ అభ్యర్థులు, వారి ఏజంట్ల సమక్షంలో జరిగింది. జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 103 మంది నామినేషన్లు ఆమోదం పొందగా 23 మందివి తిరస్కరణకు గురయ్యాయి. 4 నామినేషన్లపై శనివారం ఆర్వోలు తుది నిర్ణయం తీసుకోనున్నారు. బాపట్ల లోక్‌సభ స్థానానికి సంబంధించి 27 నామినేషన్లు ఆమోదం పొందగా, ముగ్గురికి చెందిన 7 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి

ఆమంచి నామినేషన్ పెండింగ్..

చీరాల కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమంచి కృష్ణమోహన్ నామినేషన్ దాఖలు చేయగా దానిని పెండింగ్‌లో ఉంచినట్లు ఆర్వో తెలిపారు. విద్యుత్ బకాయిలకు సంబంధించి కోట్లలో పెండింగ్ ఉన్నట్లు, నిబంధనల ప్రకారం ప్రభుత్వ బకాయిలు ఉండకూడదని ఆర్వోకు ఫిర్యాదు వెళ్లింది. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన వివరాలు సమర్పణకు శనివారం ఉదయం వరకు గడువు ఇస్తూ ఆర్వో నిర్ణయం తీసుకున్నారు. ఇదే స్థానం నుంచి మరో ఇద్దరి నామినేషన్లు కూడా పెండింగ్‌లోనే ఉంచారు. వీటితో పాటు బాపట్ల అసెంబ్లీ స్థానంలో ఒకరి నామినేషన్ పెండింగ్‌లో ఉంది. ఈ నాలుగింటిపై శనివారం తుది నిర్ణయం తీసుకోనున్నారు. బాపట్ల లోక్‌సభతోపాటు ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను టీడీపీ, వైసీపీ తరఫున బరిలో నిలిచే అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. వారి తరఫున వేసిన నామినేషన్ల విషయంలో ఉపసంహరణ తేదీ నాటికి స్పష్టత రానుంది.


స్క్రూటినీ నిర్వహిస్తున్న కలెక్టర్ బాషా, అధికారులు

తక్షణ పోలీసింగ్.. సమర్థ్ యాప్

- రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించిన బాపట్ల ఎస్పీ
- ఎస్పీని అభినందించిన సీఈవో


సమర్థ్ మొబైల్‌యాప్ గురించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వివరిస్తున్న బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, ఏప్రిల్ 26: ఎన్నికల్లో క్విక్ పోలీసింగ్‌కి సమర్థ్ మొబైల్‌యాప్‌ను రూపొందించినట్లు బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి బాపట్ల జిల్లాలో ఉపయోగిస్తున్న సమర్థ్ మొబైల్ యాప్ విశేషాలను ఎస్పీ వివరించారు. ఈ యాప్‌ను ఈనెల 22వ తేదీ నుంచి జిల్లాలో వినియోగిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా పోలీసు అధికారులు డైరెక్ట్‌గా కాల్ చేయవచ్చని ఒక నోటిఫికేషన్ ద్వారా జిల్లాలో 2వేలమంది పోలీసులకు ఒకేసారి ఆదేశాలు జారీ చేయవచ్చుఅని తెలిపారు. మొబైల్‌కి ఇంటర్నెట్ సిగ్నల్ లేకపోయిన నోటిఫికేషన్ ద్వారా వారికి సమాచారం అందుతుందన్నారు. ఎన్నికలకు సంబంధించి వచ్చే పిటిషన్‌లను సంబంధిత పోలీసు అధికారులకు యాప్ ద్వారా పంపి ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షించవచ్చు అని తెలిపారు. మొత్తం జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలు మొబైల్ నెంబర్స్‌యాప్ నందు పొందుపర్చారని, తద్వారా పోలీసు అధికారులు, సిబ్బంది రియల్ టైమ్, లోకేషన్ ఎప్పటికప్పుడు ట్రాకింగ్ చేయటం జరుగుతుందన్నారు. అదేవిధంగా సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాలను గుర్తించటానికి యాప్ నుంచి నేరుగా కంట్రోల్‌రూమ్‌కు కాల్ చేయటానికి సమస్యాత్మక ప్రాంతాలకు తక్షణమే పోలీసు బలగాలను చేరుకోవటానికి ఈ యాప్ పనిచేస్తుందని సీఈవో ముకేష్‌కుమార్ మీనాకు ఎస్పీ వివరించారు. అన్ని జిల్లాల ఎస్పీలు, సీపీలు, సెక్టార్ ఆఫీసర్‌లు వినియోగించాలని చెప్పారు. యాప్‌ను అభివృద్ధి పరిచి ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్న బాపట్ల ఎస్పీని సీఈవో అభినందించారు. కార్యక్రమంలో అదనపు సీఈవోలు పి.కోటేశ్వరరావు, ఎంఎస్ హరీంద్రప్రసాద్, బాపట్ల ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ నేత.. కోలా సుబ్బారెడ్డి

- ప్రాణమిత్రుడు కాసు బ్రహ్మానందరెడ్డిపై పోటీచేసి గెలిచిన కమ్యూనిస్టు యోధుడు


కోలా సుబ్బారెడ్డి, కూతురు భానుమతి

మాచర్లటౌన్, ఏప్రిల్ 26: రాటుతేలిన రాజకీయ జీవితం కోలా సుబ్బారెడ్డిది. 1942 ఆగస్టులో క్విట్ ఉద్యమంలో పాల్గొని కాంగ్రెస్ కార్యకర్తగా కడలూరు, తంజావూరు జైలు కెళ్లి రెండు సంవత్సరాల పాటు మోటూరు హనుమంతరావు, చండ్ర రాజేశ్వరరావు, మాజీ రాష్ట్రపతి ఆర్ వెంకట్రామన్‌తో సాన్నిహిత్యం పెరిగింది. జైలు నుంచి రాగానే కమ్యూనిస్టుగా మారిపోయారు. తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొని అజ్ఞాత వాసం గడిపిన వారే కోలా సుబ్బారెడ్డి. గుంటూరులోని టౌన్ స్కూల్‌లో చదువుకున్నారు. 1952 సాధారణ ఎన్నికల్లో మాచర్ల గురజాలను కలిపి పల్నాడు నియోజకవర్గంగా పిలిచేవారు. ఆ ఎన్నికల్లో కాసు బ్రహ్మానందారెడ్డిపై పోటీ చేసి కమ్యూనిస్టు అభ్యర్థిగా కోలా సుబ్బారెడ్డి మంచి మెజార్టీతో గెలిచారు. ఈయన తామ్రపత్ర గ్రహీత.. స్వాతంత్ర్య సమర యోధుల పింఛన్ తిరస్కరించిన త్యాగశీలి సుబ్బారెడ్డి. 1917 సెప్టెంబర్‌లో దాచేపల్లిలో జన్మించారు. అనేక భూపోరాటాలు చేసి గ్రామీణుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. ప్రస్తుతం దాచేపల్లిలో వున్న జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌కు సుమారుగా 18 ఎకరాల పొలాన్ని ఉచితంగా అందచేశారు. సుబ్బారెడ్డికి ఐదుగురు సంతానం. వారిలో ఒకరైన రెంటచింతలకు చెందిన మోదుగు భానుమతి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ అప్పట్లో కక్షలుండేవి కావని, ఎడ్లబండి మీద వెళ్లి ప్రచారం చేశారని ఎన్నికల ఖర్చు రూ.250కు మించలేదని తమ తల్లిదండ్రులు చెప్పే వారన్నారు. మా నాన్నపై బ్రహ్మానందరెడ్డి ఓడిపోయినా పింఛన్ విషయంలో చొరవ తీసుకుని ఇప్పించారని, అప్పుడు నేతల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు ఇదే నిదర్శనమన్నారు. సుబ్బారెడ్డి 1992 డిసెంబర్ 5న మృతి చెందగా భార్య చెన్నమ్మ 2016 ఆగస్టులో మృతి చెందారు. మాచర్ల నుంచి కమ్యూనిస్టు పార్టీ తరఫున ఇద్దరు ఎమ్మెల్యేలు అసెంబ్లీలోకి అడుగు పెట్టగా వారిలో సుబ్బారెడ్డితో పాటు 1955 ఎన్నికల్లో గెలిచిన మందపాటి నాగిరెడ్డి మరొకరు.

30న తెనాలికి చంద్రబాబు

- సుల్తానాబాద్ నుంచి రోడ్ షో
- మార్కెట్ సెంటర్‌లో బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్, పక్కన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

తెనాలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు మంగళవారం తెనాలి వస్తున్నట్లు జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శుక్రవారం ఆయన తన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో చంద్రబాబు పర్యటన వివరాలను తెలిపారు. హెలికాప్టర్‌లో సుల్తానాబాద్‌లో దిగిన అనంతరం అక్కడి నుంచి చెంచుపేట, మారీస్‌పేట మీదుగా జరిగే రోడ్ షోలో చంద్రబాబు పాల్గొంటారన్నారు. అనంతరం అదే రోజు సాయంత్రం మార్కెట్ సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో మాట్లాడతారని చెప్పారు. ఇటీవల పవన్‌కల్యాణ్ పర్యటనను విజయవంతం చేసినట్లే చంద్రబాబు కార్యక్రమాన్ని కూడా రెట్టింపు ఉత్సాహంతో విజయవంతం చేయాలని జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులను, అభిమానులను కోరారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో చర్చించి చంద్రబాబు పర్యటన కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న అనేక అంశాలపై చంద్రబాబుకు అవగాహన ఉందని, ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడ్డాక తెనాలికి పూర్వవైభవాన్ని తీసుకొస్తారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు తాడిబోయిన హరిప్రసాద్, మమ్మద్ ఖుద్దూస్, బీజేపీ జిల్లా నాయకుడు పాటిబండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురి.. అరంగేట్రం

- ప్రధాన పార్టీల నుంచి ఎన్నికల బరిలో కొత్త ముఖాలు
- టీడీపీ నుంచి ఒకరు... వైసీపీ నుంచి ఐదుగురు

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగి ప్రత్యర్థులపై నెగ్గి అసెంబ్లీలో అడుగు పెట్టాలని ఆయా అభ్యర్థులు ఉవ్విళ్లూరుతున్నారు. గుంటూరు జిల్లాలోని ఒక లోక్‌సభ, 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ తరఫున పోటీ చేస్తున్న వారిలో చాలామందికి ఇవే ప్రథమ ఎన్నికలు. గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ తరుఫున డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బరిలో నిలిచారు. ఆయన ప్రత్యక్షంగా పోటీ చేయడం ఇదే ప్రప్రథమం. 2014, 19లో నరసరావుపేట ఎంపీ సీటు కోసం ప్రయత్నించి నప్పటికీ సాధ్యపడలేదు. ఈసారి చంద్రబాబుని మెప్పించి ఒప్పించి సాధించారు. టిక్కెట్ పొందిన రోజు నుంచే ఆయన తనదైన శైలిలో గ్రౌండ్‌వర్కు చేసుకొంటూ దూసుకుపోతున్నారు. పెమ్మసాని ఎంపీ అభ్యర్థిగా రావడంతో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులకు కొండంత బలం వచ్చినట్లు అయింది. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి నూరి ఫాతిమాకు ఇవే తొలి ఎన్నికలు. తన తండ్రి ముస్తఫాకు వారసురాలుగా వచ్చారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గళ్లా మాధవి రాజకీయాలకు కొత్త. ఆమె భర్త రామచంద్రరావు రియల్‌ఎస్టేట్ వ్యాపారిగా సుపరిచితుడు. ప్రత్తిపాడులో వైసీపీ అభ్యర్థి బాలసాని కిరణ్‌కు ఇవే తొలి ఎన్నికలు. పొన్నూరులో మంత్రి అంబటి రాంబాబు సోదరుడు అంబటి మురళీకృష్ణకు సీటు ఇచ్చింది. తొలిసారి ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకొంటున్నారు. మంగళగిరిలో వైసీపీ మరోసారి కొత్త అభ్యర్థి మురుగుడు లావణ్యని బరిలోకి దింపింది. ఆమె రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చారు.

విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించండి

- తెనాలిలో పోలీస్ అధికారులతో ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి

తెనాలి రూరల్, ఏప్రిల్ 26: ఎన్నికల విధుల్లో పోలీసులు నిస్పక్షపాతంగా వ్యవహరించాలి.. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే తెలుసుకుని వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టండి.. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రణాళికతో ముందుకు సాగాలని ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి అన్నారు. శుక్రవారం తెనాలి డీఎస్పీ కార్యాలయానికి విచ్చేసి ఆయన ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చేపట్టాల్సిన విధి విధానాలపై తెనాలి డివిజన్‌లోని పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధనలను తూచాతప్పకుండా అమలు చేయాలన్నారు. ఎవరైనా సరే నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించవద్దన్నారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పట్టణ, గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో సీసీకెమెరాలు, భద్రతా అంశాలపై చేపట్టాల్సిన పలు సూచనలను ఆయన వివరించారు. ఎన్నికల ప్రచారం చేసే వారు ముందస్తుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో పర్మిషన్ తీసుకునేలా చూడాలన్నారు. మైక్ అనౌన్స్‌మెంట్స్ ప్రచార కార్యక్రమాలు సమయపాలన తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. పట్టణ, గ్రామాల్లో ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన పెంచాలని, ఎన్నికల సజావుగా జరిపేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఐజీ ఆదేశించారు. డీఎస్పీ, పట్టణ, రూరల్ సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

అనగాని ఫిర్యాదుకు అధికారుల స్పందన

- ఊలుపాలెం గ్రామానికి తాగునీరు సరఫరా

రేపల్లె, ఏప్రిల్ 26: మండలంలోని ఊలుపాలెం గ్రామంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ నామినేషన్‌కు రావటంతో ఉప్పూడి గ్రామ సర్పంచ్ భర్త అనుచరులు పంప్‌హౌస్‌కు తాళం వేసి ఫీజు తీసి నీరు నిలుపుదల చెయ్యటంతో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు శుక్రవారం ఉదయం పంప్‌హౌస్ తాళాలు తీసి విద్యుత్ మీటరు ఫీజును ఏర్పాటు చేసి ప్రజలకు యథావిధిగా తాగునీరు అందించారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు అండగా ఉంటామని హామీనిచ్చి హర్షం వ్యక్తం చేశారు.

35 ఏళ్ల పాటు వారసులే


ఆలపాటి వెంకట్రామయ్య | దొడ్డపనేని ఇందిర | గోగినేని ఉమ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 26: తెనాలి అసెంబ్లీ నియోజకవర్గంలో 35 ఏళ్ల పాటు అధికారం తండ్రి, కుమార్తె, మనమరాలికి ప్రజలు కట్టబెట్టారు. నియోజకవర్గం చరిత్ర పరిశీలిస్తే ఎన్నికలు మొదలైన 1952 నుంచి 1982 వరకు ఆలపాటి వెంకట్రామయ్య మూడుసార్లు, ఆయన కుమార్తె దొడ్డపనేని ఇందిర మూడు పర్యాయాలు, ఆలపాటి మనుమరాలు గోగినేని ఉమ ఒకసారి గెలిచారు. 1952, 1955, 1962లో వెంకట్రామయ్య, 1967, 1972, 1978లో ఇందిర, 1999లో ఉమ విజయం సాధించారు. కేఎల్పీ, సీపీఐ అభ్యర్థులు రావి సత్యనారాయణ, రావి అమ్మయ్యలను వెంకట్రామయ్య ఓడించారు. 1967లో కాంగ్రెస్ టికెట్‌తో గెలిచిన ఇందిర 1972, 1977లో కాంగ్రెస్ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఆమె ఒకసారి స్వతంత్ర అభ్యర్థిగా, మరోసారి జనతాపార్టీ అభ్యర్థిగా పోటీచేసి కాం గ్రెస్ అభ్యర్థి నన్నపనేని వెంకట్రావును ఓడించారు. వెంకట్రామయ్య మనుమరాలు, ఇందిర కుమార్తె అయిన గోగినేని ఉమ ఆనాటి కాంగ్రెస్ దిగ్గజం కొణిజేటి రోశయ్యను ఓడించి సంచలనం సృష్టించారు. 1967లో దొడ్డపనేని ఇందిరకు వచ్చిన మెజార్టీ 32335 ఇప్పటివరకు ఎవరూ అధిగమించలేదు.

బ్యాలెట్ యూనిట్లపై కసరత్తు

- 16 మంది కంటే ఎక్కువ ఉంటే రెండో బ్యాలెట్ యూనిట్ అవసరం
- తాడికొండ, పొన్నూరు, తెనాలి, ప్రత్తిపాడుకు ఒక యూనిట్ చాలు
- నామినేషన్ల ఉపసంహరణల బట్టి మిగతా నియోజకవర్గాల భవితవ్యం

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో అభ్యర్థులు, ఓటర్లు బ్యాలెట్ యూనిట్లపై దృష్టి సారిస్తున్నారు. నామినేషన్ల స్క్రూటినీ ముగిసిన నేపథ్యంలో నిబంధనలకు అనుగుణంగా లేని కొన్నింటిని తిరస్కరించారు. దీంతో ఒక్క బ్యాలెట్ యూనిట్‌తో పోలింగ్ నిర్వహించే నియోజకవర్గాలపై కొంత స్పష్టత వచ్చింది. తాడికొండ, పొన్నూరు, తెనాలి, ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆమోదించిన నామినేషన్లు 15 కంటే తక్కువ ఉన్నందున వాటిల్లో ఒక్క బ్యాలెట్ యూనిట్‌తో పోలింగ్ నిర్వహిస్తారు. గుంటూరు పార్లమెంట్, మంగళగిరి, గుంటూరు తూర్పు, పశ్చిమలో ఇంకా అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్నందున పోలింగ్‌కు ఈవీఎంలలో ఎన్ని బ్యాలెట్ యూనిట్లు వినియోగించాలన్న దానిపై స్పష్టత లేదు. సోమవారం సాయంత్రానికి నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియనున్న నేపథ్యంలో ఆ సమయానికి అంత తెలిపోతుంది.

ఈవీఎంలోని బ్యాలెట్ యూనిట్‌లో గరిష్ఠంగా 16 మంది పేర్లు మాత్రమే పడతాయి. ఇందులో ఒకటి నోటాకి కేటాయిస్తే 15 మంది అభ్యర్థుల పేర్లతో బ్యాలెట్ పేపర్‌ని ముద్రించి బ్యాలెట్ యూనిట్‌లో చేరుస్తారు. 16 మంది కంటే ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం కూడా బరిలో నిలిస్తే రెండో బ్యాలెట్ యూనిట్‌ని లింక్ చేయాల్సి ఉంటుంది. 32 మంది అభ్యర్థులు దాటితే మూడో బ్యాలెట్ యూనిట్‌ని లింక్ చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఒక ఈవీఎంలో 64 మంది అభ్యర్థులకు మించి బ్యాలెట్ యూనిట్లను చేర్చలేరు. కాగా 2000 మంది మాత్రమే ఒక ఈవీఎంలో ఓటు వేయగలరు.


వీటిని పరిగణనలోకి తీసుకొంటే గుంటూరు లోక్‌సభ స్థానానికి ఇంకా 34 మంది బరిలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ రోజున గడువు ముగిసే సమయానికి అభ్యర్థుల సంఖ్య 16 కంటే తగ్గితే ఒక బ్యాలెట్ యూనిట్, 16 నుంచి 32 మధ్యన ఉంటే రెండో బ్యాలెట్ యూనిట్, 32 దాటితే మూడో బ్యాలెట్ యూనిట్‌తో పోలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇది ఎంతో శ్రమతో కూడుకొన్న వ్యవహారం అవుతుంది. అత్యధికంగా మంగళగిరిలో 42 మంది అభ్యర్థులు నామినేషన్ల పరిశీలన అనంతరం బరిలో ఉన్నారు. ఇదే సంఖ్య కొనసాగితే మూడు బ్యాలెట్ యూనిట్‌లు ఆ నియోజకవర్గంలో పోలింగ్‌కు అవసరమౌతాయి. గుంటూరు పశ్చిమలో ప్రస్తుతానికి 31 మంది బరిలో ఉన్నారు. ఇక్కడ రెండు బ్యాలెట్ యూనిట్లతో పోలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి రావొచ్చు. గుంటూరు తూర్పులో 17మంది ఉన్నారు. వీరిలో ఇద్దరు ఉపసంహరించుకొంటే ఒక్క బ్యాలెట్ యూనిట్‌తోనే ఈవీఎంలలో పోలింగ్ నిర్వహించ వచ్చు. బ్యాలెట్ యూనిట్‌లు ఒకటి కంటే ఎక్కువ పెరిగే కొద్దీ ఓటర్లకు కూడా అయోమయంగా మారుతుంది. తాము ఓటు వేయదలిచిన అభ్యర్థి పేరు ఏ బ్యాలెట్ యూనిట్‌లో ఉందో వరుస క్రమంలో వెతుక్కోవాలి. ఇది ఎక్కువ పోలింగ్ సమయానికి కూడా దారి తీయొచ్చు.

గురజాల బరిలో.. పురుషులే

- ఇప్పటికి 12సార్లు ఎన్నికలు
- అత్యధికంగా ఏడవసారి బరిలో యరపతినేని

పిడుగురాళ్ల, ఏప్రిల్ 26: పల్నాడులో రాజకీయ చైతన్యం కలిగిన గురజాలకు ఓ ప్రత్యేకత వుంది. పల్నాడు చరిత్రకు గురజాలకు అవినాభావ సంబంధం వుంది. 800 ఏళ్ల చరిత్ర కలిగిన పల్నాడుకు 1952లో దేశవ్యాప్తంగా జరిగిన సాధారణ ఎన్నికలలో గురజాల, మాచర్ల కలిపి పల్నాడు నియోజకవర్గంగా వుండేది. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణతో 1955లో గురజాల అసెంబ్లీ స్థానం ఏర్పాటైంది. 1955లో గురజాల అసెంబ్లీ స్థానానికి మొట్టమొదట ఎన్నికలు జరుగగా 2019తో కలుపుకొని మొత్తం 12సార్లు ఎన్నికలు జరిగాయి. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో పురుషులు మాత్రమే పోటీ చేయగా ఒక్కసారి కూడా మహిళలు పోటీ చేసిన దాఖలాలు లేవు. వచ్చే మే నెల 13న జరుగనున్న ఎన్నికలతో 13వ సారి గురజాలకు ఎన్నికలు జరుగనున్నాయి. 1955లో మొట్టమొదటి ఎన్నికలలో క్రిషికార్ లోక్‌పార్టీ తరుపున మండవ బాపయ్య చౌదరి, సీపీఐ తరఫున కోలా సుబ్బారెడ్డి పోటీ చేయగా మండల బాపయ్య చౌదరి గెలుపొందారు. 1962లో కాంగ్రెస్ తరుపున కొత్త వెంకటేశ్వర్లు, సీపీఐ తరపున కోలా సుబ్బారెడ్డి పోటీ చేయగా కాంగ్రెస్ అభ్యర్థి కొత్త వెంకటేశ్వర్లు గెలుపొందారు. 1967లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున కొత్త వెంకటేశ్వర్లు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా సీఎం గడిపూడి పోటీ చేయగా కొత్త వెంకటేశ్వర్లు గెలుపొందారు. 1972లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ తరఫున మందపాటి నాగిరెడ్డి, కాంగ్రెస్ తరఫున కొత్త వెంకటేశ్వర్లు తలపడగా సీపీఐ అభ్యర్థి మందపాటి నాగిరెడ్డి గెలుపొందారు. 1978లో కాంగ్రెస్(ఐ) తరుపున గడిపూడి మల్లికార్జునరావు, సీపీఐ తరపున మందపాటి నాగిరెడ్డి, జనతా పార్టీ తరుపున మహ్మద్ మొహిద్దీన్‌లు పోటీ పడగా కాంగ్రెస్ (ఐ) అభ్యర్థి గడిపూడి మల్లికార్జునరావు గెలుపొందారు. 1983లో టీడీపీ ఆవిర్భావం తరువాత జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున జూలకంటి నాగిరెడ్డి, కాంగ్రెస్ తరుపున కాసు వెంకట కృష్ణారెడ్డి పోటీపడగా టీడీపీ అభ్యర్థి జూలకంటి నాగిరెడ్డి గెలుపొందారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికలలో టీడీపీ తరఫున ముత్యం అంకిరెడ్డి, కాంగ్రెస్ తరఫున కాయితి వెంకట నర్సిరెడ్డిలు పోటీపడగా టీడీపీ అభ్యర్థి ముత్యం అంకిరెడ్డి గెలుపొందారు. 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున కాయితి వెంకట నర్సిరెడ్డి, టీడీపీ తరఫున రాచమడుగు (అనుమోలుశెట్టి) సాంబశివరావు పోటీపడగా కాంగ్రెస్ అభ్యర్థి కాయితి వెంకట నర్సిరెడ్డి గెలుపొందారు. 1994లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున యరపతినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ తరఫున కనకం రమేష్ చంద్రదత్ తలపడగా టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు గెలుపొందారు. 1999లో జరిగిన ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా యరపతినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జంగా కృష్ణమూర్తి పోటీలో నిలవగా కాంగ్రెస్ అభ్యర్థి జంగా కృష్ణమూర్తి గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున యరపతినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ తరఫున జంగా కృష్ణమూర్తి పోటీపడగా జంగా కృష్ణమూర్తి గెలుపొందారు. 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున యరపతినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ తరఫున ఆలా వెంకటేశ్వర్లు, ప్రజారాజ్యం పార్టీ తరఫున గుర్రం గోపిశ్రీధర్ తలపడగా టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున యరపతినేని శ్రీనివాసరావు, వైసీపీ తరుఫున జంగా కృష్ణమూర్తి పోటీ పడగా టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు గెలుపొందారు. 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున యరపతినేని శ్రీనివాసరావు, వైసీపీ తరఫున కాసు మహేష్‌రెడ్డి, జనసేన పార్టీ తరఫున చింతలపూడి శ్రీనివాసరావులు పోటీ పడగా కాసు మహేష్‌రెడ్డి గెలుపొందారు. గురజాల నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఇప్పటికి 13 సార్లు ఎన్నికలు జరిగాయి. టీడీపీ అభ్యర్థిగా 1994 నుంచి ఇప్పటివరకు ఏడుసార్లు యరపతినేని శ్రీనివాసరావు పోటీ చేయగా 1994, 2009, 2014లో గెలుపొందారు. జంగా కృష్ణమూర్తి 1999, 2004లో గెలుపొందారు. త్వరలో జరుగ నున్న 2024 ఎన్నికల్లో ప్రధాన పార్టీల తరఫున యరపతినేని శ్రీనివాసరావు, కాసు మహేష్‌రెడ్డిలు మరలా తలపడనుండగా విజయం ఎవరిని వరించనుందో ఓటరు మహాశయులకే ఎరుక.

100 Gurajala Assembly Constituency



నీటి పథకాలకు వైసీపీ ఎగనామం

- పనులు పూర్తికాక ఇబ్బందులు
- పూర్తి స్థాయిలో సరఫరాకాని నీరు
- రెండ్రోజులకోసారి రంగుమారినవి విడుదల
- ప్రజల ఆందోళన
- అధికారులు, పాలకవర్గం పర్యవేక్షణ కరువు

అద్దంకి, ఏప్రిల్ 26 : అద్దంకి పట్టణంలో మంచినీటి సరఫరాలో రెండున్న దశాబ్దాల క్రితం పరిస్థితులు మరలా వచ్చాయా అన్న భయం మళ్లీ మొదలైంది. రెండున్నర దశాబ్దాల కిందట పట్టణ అవసరాలకు సరిపడా నీటి సరఫరా లేదు. వేసవి కాలం వస్తే ఊటబావులలో నీటి లభ్యత లేక తాగు నీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు వచ్చేవి. అప్పటి మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా సందిరెడ్డి శ్రీనివాసరావు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి పొలాలలో ప్రత్యేకంగా బోర్లు వేసి తాగు నీటి కష్టాల నుంచి పట్టణ ప్రజలను గట్టెక్కించారు. అనంతరం పెద్దగా నీటి సమస్య ఉత్పన్నం కాలేదు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అద్దంకి పట్టణానికి రాబోయే నాలుగైదు దశాబ్దాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సుమారు రూ.85కోట్లతో మంచినీటి పథకానికి నిధులు కేటాయించి పనులు కూడా ప్రారంభించారు. గత ఐదేళ్ల కాలంలో అధికార వైసీపీ ఆ పనులు పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమైంది. దీనికి తోడు అద్దంకి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో (గతంలో పంచాయతీ కార్యాలయం) నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో నీటిని ట్యాంక్‌కు ఎక్కించకుండా నేరుగా సరఫరా చేస్తున్నారు. అదే సమయంలో కాకాని పాలెం ట్యాంక్‌కు నీటిని పంపింగ్ చేసే మోటార్‌లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. రామ్‌నగర్ ట్యాంక్‌కు నీటి సరఫరా చేసే పైప్ లైన్‌లు తరచూ పోతున్నాయి. దీంతో తరచూ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. రామ్‌నగర్ ట్యాంక్ పరిధిలో కొన్ని ప్రాంతాలలో ఇటీవల కాలంలో రోజు మార్చి రోజు నీటిని ఇస్తున్నారు. అదే సమయంలో గతంలో విడుదల చేసే నీటిలో సగం కూడా విడుదల కావడం లేదు. దీంతో పక్షం రోజులుగా అద్దంకి పట్టణంలో నీటి కష్టాలు ఏర్పడ్డాయి.

రంగుమారిన నీరు సరఫరా

అసలే అంతంత మాత్రంగా సరఫరా అవుతున్న నీటికి తోడు రంగుమారిన నీరు వస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సాధారణ అవసరాలకు కూడా ఇవి వాడుకునేలా లేకపోవడంతో పారబోస్తున్నారు. ప్రధానంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న ట్యాంక్ పరిధిలో నీరు ట్యాంక్‌కు పంపింగ్ చేయకుండా నేరుగా వదులుతుండడంతో రంగు మారిన నీరు వస్తోందని ప్రజలు వాపోతున్నారు. పైపులలో పేరుకు పోయిన మట్టి నీటిలో కలుస్తుండడంతో ఇలా వస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తరచూ పైప్‌లైన్‌లలో లో పేరుకుపోయిన మట్టి, మలినాలను బయటకు వదిలి వేసేలా చూసాక నీటిని విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ అధికారులతో పాటు పాలకవర్గం కూడా పర్యవేక్షణ లేకపోవడంతో వారం రోజులుగా రంగుమారిన నీరు సరఫరా అవుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటిని పూర్తిస్థాయిలో సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అద్దంకిలో మున్సిపల్ కార్యాలయం ట్యాంక్ పరిధిలో కుళాయిల ద్వారా వస్తున్న రంగు మారిన నీరు



గొట్టిపాటికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కమల్‌కిషోర్

అభివృద్ధి కోసం గొట్టిపాటిని గెలిపించాలి

బల్లికురవ, ఏప్రిల్ 26 : రెండు దశాబ్దాలుగా ప్రజా సేవలో ఉంటూ గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టిన ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను గెలిపించాలని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) కోరారు. శుక్రవారం మండలంలోని కొప్పెరపాలెం గ్రామంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాబీ ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేని ఫెస్టోను ప్రజలకు వివరించారు. జగన్‌రెడ్డికి ఒక్క చాన్స్ ఇచ్చి అన్నివర్గాల ప్రజలు నష్టపోయారన్నారు. అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని బాబీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కోట శ్రీనివాసరావు, చల్లగుండ్ల వీరాంజనేయులు, యర్రా అంజయ్య, కోట వసంతరావు, తుబాటి కిషోర్, బత్తుల ఆజయ్య, గొర్రెపాటి ఆదాం, ఒట్టిగోర్ల గురవయ్య పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం

మండలంలోని వల్లాపల్లి గ్రామంలో ఆగ్రామ టీడీపీ నేత పరుసు ప్రేమప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంచుతూ అవగాహన కల్పించారు. జగన్‌రెడ్డి నవరత్నాలతో నవ మోసాలకు పాల్పడ్డారని, వైసీపీని ఓటుతో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పత్తిపాటి వెంకట్రావు, మందా వీరాంజనేయులు, మహేష్ పాల్గొన్నారు.

విధ్వంసం తప్ప .. అభివృద్ధి లేదు



మహాలక్ష్మి కాలనీలో ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

చినగంజాం, ఏప్రిల్ 26 : వైసీపీ ఐదేళ్ల పాలనలో విధ్వంసం తప్ప అభివృద్ధి ఎక్కడా లేదని టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని పెదగంజాం గామంలోని ఎస్సీ కాలనీ, చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మి, ప్రభుదేవా కాలనీలలో టీడీపీ కూటమి పర్చూరు అసెంబ్లీ, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థులు ఏలూరి సాంబశివరావు, టి.కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కూటమి నాయకులు శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, టీ.జయరావు, మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, షేక్ జిలాని, షేక్ ఖాజావలి, ఎం.లక్ష్మయ్య, ధర్మవరపు ఏసునారాయణ, పి.పార్థసారథి, పీ.శ్రీనివాసరావు, నరహరి గోపి, ఎం.పద్మావతి, చేవూరి రవణమ్మ, టి.చిన్నా, జి.వెంకటనారాయణ, టి.వెంకటేశ్వరావు, షేక్.బాజీ, ఎం.రామాంజనేయులు అహ్మద్, ఎస్.సూరిబాబు, అమిర్జాన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చినగంజాం, ఏప్రిల్ 26 : మండలంలోని సోపిరాల, మున్నంవారిపాలెం గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పి.గణనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సోపిరాల, మున్నంవారిపాలెం గ్రామాల్లో విద్యుత్ లైనులకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్యవైశ్యులకు జే టాక్స్ దెబ్బ

- వైసీపీ పాలనలో వ్యాపారాలు, పరిశ్రమలు నాశనం
- అందరికీ అండగా ఉంటాం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి



15వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, ఏప్రిల్ 26 : చిరు వ్యాపారులకు, దినసరి కూలీలకు టీడీపీ అండగా ఉంటుందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉదయం అద్దంకి పట్టణంలోని 15వ వార్డు, రాత్రి మండలంలోని కొటికలపూడిలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ వైసీ పీ అధికారం చేపట్టిన తరువాత అద్దంకి పట్టణం, బల్లికురవ, మేదరమెట్లలో రోడ్లకు ఇరువైపులా చిరు వ్యాపారుల భవనాలు ఇష్టారీతిన ఖాళీ చేయించి వారి పొట్టకొట్టారన్నారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండించామన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ నుంచి ఈ ఐదేళ్లలో ఒక్క రూపాయి లబ్ధి చేకూరలేదన్నారు. కేంద్రం తెచ్చిన ఈబీసీ చట్టంలో ఆర్యవైశ్యులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కృషిచేస్తానన్నారు. పేద ఆర్యవైశ్యులకు టీడీపీ పాలనలో కేటాయించిన టిడ్కో ఇళ్లు, రేషన్ కార్డులు వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రద్దు చేసిందన్నారు. పేద ఆర్యవైశ్యుల విద్యార్థుల విదేశీ విద్య అందించడానికి కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించేలా టీడీపీ చర్యలు తీసుకుంటుందన్నారు. జగన్ అండ్ కో జే ట్యాక్స్ విధానాల కారణంగా ఆర్యవైశ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రకరకాల పన్నులతో వ్యాపారులను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్యవైశ్యులు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఆర్యవైశ్యులలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పాలన ఉంటుందన్నారు. పేదలు, మహిళలకు ప్రత్యేక పథకాల ద్వారా మరింత లబ్ధి చేకూరుస్తామన్నారు. ముందుగా కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొటికలపూడిలో రైతులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో రైతులకు తీరని అన్యాయం జరిగిందని రవికుమార్ అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చిన్ని శ్రీనివాసరావు, కౌన్సిలర్ అంకం తేజశ్విని, చుండూరి మురళి, గట్టుపల్లి రామారావు, కొటికలపూడి సర్పంచ్ పూనాటి విక్రమ్, మాజీ సర్పంచ్ వెంకట్రావు పాల్గొన్నారు.



5వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న హర్షవర్ధన్

యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయం

గొట్టిపాటి హర్షవర్ధన్

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే టీడీపీ ధ్యేయమని గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ అన్నారు. శుక్రవారం రాత్రి అద్దంకి పట్టణంలోని 5వ వార్డులో హర్షవర్ధన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అందించే పథకాలను వివరించారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గార్లపాటి శ్రీనివాసరావు, వడ్డవల్లి పూర్ణ చంద్రరావు, చిలుకూరి అనిల్, కిరణ్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

పర్చూరు, ఏప్రిల్ 26 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు దాఖలు చేసుకున్న నామినేషన్ల స్రూట్నీ (పరిశీలన) ప్రక్రియ శుక్రవారం రెవెన్యూ కార్యాలయ పాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎన్నికల పరిశీలకులు ఖాజాన్‌సింగ్ (ఐఏఎస్), రిటర్నింగ్ అధికారి గందం రవీందర్ ఆధర్యంలో అధికారులు నామినేషన్ పత్రాలను పరిశీలించారు. పర్చూరు అసెంబ్లీకి సంబంధించి 20 మంది అభ్యర్థులకు గాను 35 నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. వాటిలో మూడు నామినేషన్‌లు సరైన పత్రాలు జమచేయకపోవడంతో తిరస్కరించినట్లు కార్యలయం సిబ్బంది తెలిపారు. అందులో దీపక్ గోపాలం (యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ), మైలా నాగలక్ష్మి (భాతర జాతీయ కాంగ్రెస్ పార్టీ), శ్యానం సురేష్ (జై భీమ్‌రావ్ భారత్ పార్టీకి) సంబంధించి నామినేషన్ చెల్లుబాటు కానివిగా అధికారులు ధ్రువీకరించారు. కార్యక్రమంలో పర్చూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, కారంచేడు మెహర్‌బాబు, చినగంజాం ఫణీంద్రబాబు, ఇంకొల్లు ప్రమీలా, మార్టూరు తహసీల్దార్ సంధ్యశ్రీ, యద్దనపూడి వై.నాగరాజు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు పాల్గొన్నారు.



నామినేషన్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆమంచి నామినేషన్‌పై ఫిర్యాదు

చీరాల, ఏప్రిల్ 26 : ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ (కాంగ్రెస్) తరపున చీరాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఆమంచి కృష్ణమోహన్ తన అఫడవిట్‌లో వాస్తవాలను పూర్తి స్థాయిలో తెలియరవరచలేదని నాయుడు నాగార్జునరెడ్డి అనే వ్యక్తి శుక్రవారం ఈఆర్వో సూర్యనారాయణరెడ్డికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇటీవల నాగార్జునరెడ్డి ఆమంచిపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు కూడా పలు అంశాలకు సంబంధించి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన ఆధారాలను కూడా నాగార్జునరెడ్డి ఈఆర్వోకు అందజేవారు. పరిశీలించి చర్యలు చేపడతామని ఈఆర్వో తెలిపారు.



అభయాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

మార్టూరు, ఏప్రిల్ 26 : మండలంలోని ద్రోణాదుల గ్రామ శివార్లలో శుక్రవారం స్వర్గీయ గోరంట్ల సాంబశివరావు తోటలో శ్రీ అభయంజనేయస్వామి శిలా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చింతపల్లిపాడు గ్రామానికి చెందిన ఆచార్యులు నారాయణం శ్రీనివాసాచార్యులు, నారాయణ వెంకట సందీప్‌దీక్షిత్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శిలా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ద్రోణాదుల ప్రజానీకంతో పాటు నాగండ్ల, సూదివారిపాలెం గ్రామస్థులు కార్యక్రమానికి విచ్చేసి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తరువాత భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.

వైభవంగా వీరాంజనేయస్వామి తిరునాళ్ల



బల్లికురవ, ఏప్రిల్ 26 : మండలంలోని అంబడిపూడి గ్రామంలో ఉన్న వీరాంజనేయ స్వామి 41వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తులు ఉదయం నుంచే వీరాంజనేయస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, ఆకు పూజలలో పాల్గొన్నారు. దేవాలయ పూజారి గుడిమెళ్ల పవన్‌కుమార్ పర్యవేక్షణలో వీరాంజనేయస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్థులు పొంగళ్లు పెట్టుకొని మెక్కుబడులు తీర్చుకొన్నారు. గ్రామ పెద్దల సహకారంతో తిరునాళ్ల సందర్భంగా కోలాట భజన కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరునాళ్లకు అంబడిపూడి గ్రామంతో పాటు పరిసనర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.

వైక్యలం బలాదూర్

జేఈఈ మెయిన్స్‌లో 1759 ర్యాంక్ సాధించిన ఓంకార్ వరుణ్



పంగులూరు, ఏప్రిల్ 26: చదువుకు వైకల్యం అడ్డుకాదని నిరూపించాడు ఓంకార్ వరుణ్. మండలంలోని రామకూరు గ్రామానికి చెందిన చీమకుర్తి ఓం కార్ వరుణ్ జేఈఈ మెయిన్స్‌లో 1759 ర్యాంక్ సాధించాడు. పుట్టకతోనే వైకల్యం బారినపడి నడవలేని స్థితిలో ఉన్న వరుణ్ తన తల్లి మరణం, తండ్రి ఎడబాటుతో కుంగిపోలేదు. వరుణ్ తాత యక్కల కాశీవిశ్వనాథం చేరదీశారు. తాత ప్రోత్సాహంతో జేఈఈలో ర్యాంక్ సాధించిన వరుణ్‌ను గ్రామస్థులు అభి నందించారు.

బూత్ కన్వీనర్లు కీలకంగా వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవి

చీరాల, ఏప్రిల్ 26 :ఎన్నికల వేళ పోలింగ్ సమయంలో బూత్ కన్వీనర్లు కీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్సీ చిరంజీవి అన్నారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి బూత్ కన్వీనర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో బూత్ కన్వీనర్లు చేపట్టాల్సిన విధులు, బాధ్యతలను తెలిపారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ముప్పవరపు వీరయ్యచౌదరి పాల్గొన్నారు.

మార్టూరులో ఘనంగా ఉరుసు



ఉరుసు ఉత్సవంలో పాల్గొన్న భక్తులు.. ఆకట్టుకున్న ప్రభ

మార్టూరు, ఏప్రిల్ 26 : మార్టూరులో కొణిదెన రోడ్‌లో ఉన్న హజరత్ కరిముల్లా షావలి ఉరుసు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు దర్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలంకరణతో దర్గాను అలంకరించారు. ఉదయం నుంచి వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారు దర్గా వద్ద కొబ్బరి కాయలు కొట్టి మొక్కుకున్నారు. కమిటీ సభ్యులు విద్యుత్ దీపాలంకరణతో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. ఏటా ప్రకాశం, గుంటూరు, పల్నాడు, నెల్లూరు జిల్లాలనుంచి కూడా భక్తులు ఉరుసు వేడుకలకు భారీగా వస్తుంటారు. ఈ ఏడాది ఎన్నికల నేపథ్యంలో ఇతర ప్రాంతాలవారు తక్కువగా వచ్చారు. కోడ్ దృష్ట్యా ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను కమిటీవారు ఏర్పాటు చేయలేదు. మండలంలోని ఇతర గ్రామాలతోపాటు, యద్దనపూడి, బల్లికురవ మండలాల నుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్త పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్‌ఐలు బాషా, సైదా, యద్దనపూడి, బాపట్ల స్టేషన్‌లకు చెందిన సుమారు 40 మంది పోలీసులు పర్యవేక్షించారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

సిబ్బందికి ఏఎస్పీ సూచన - సమస్యాత్మక ప్రాంతాలపై అప్రమత్తం



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏఎస్పీ

చీరాలటౌన్, ఏప్రిల్ 26 : ఎన్నికల విధుల్లో సిబ్బంది అలసత్వం వహించరాదని, సమస్యాత్మక ప్రాంతాలలో అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శుక్రవారం కారంచేడు పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం స్వర్ణ గ్రామంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అలాగే చీరాల వన్‌టౌన్, టూటౌన్ స్టేషన్‌ల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సెయింట్ ఆన్స్ కళాశాలలోని స్ట్రాంగ్ రూం వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించి సూచనలు చేశారు. అన్ని ప్రాంతాల్లో భద్రతాపరమైన లైటింగ్ ఉంచాలన్నారు. కేంద్రాల వద్ద విధులు నిర్వహించే వారికి పలు హెచ్చరికలు జారీ చేశారు. స్వేచ్ఛాయుత పోలింగ్ జరిగేందుకు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఏఎస్పీ తెలిపారు. ఆయనవెంట చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐలు శేషగిరిరావు, సోమశేఖర్, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వైసీపీకి షాక్



ఏలూరి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన అడుసుమల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్వర్లు తదితరులు

- అడుసుమల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడితో సహా 50 కుటుంబాలు టీడీపీలో చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన ఏలూరి

పర్చూరు, ఏప్రిల్ 26 : పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు అడ్డగడ్డ వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో శుక్రవారం పార్టీలో చేరారు. ఆయనకు టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి కండువా కప్పి ఆహ్వానించారు. అడ్డగడ్డతోపాటు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థంపుచ్చుకున్నాయి. వారిని ఏలూరి ఆహ్వానించారు. మార్టూరు మండలం వలపర్ల గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో సైకిలెక్కారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు ఓవ్యక్తి గెలుపు ఓటమి కోసం కాదని, రాష్ట్ర భవిష్యత్‌కు, రాష్ట్ర ప్రయోజనాల కోసమన్నారు. వైసీపీ పాలనలో జరుగుతున్న అరాచక విధ్వంస పాలనకు ప్రజలు తగిన గుణపాఠం చెపుతారన్నారు. ప్రజలు విజ్ఞతతో ఓటు వేయాలని కోరారు.

అడుసుమల్లి గ్రామంలో.. పర్చూరు మండలం అడుసుమల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు అడ్డగడ్డ వెంకటేశ్వర్లు అధ్వర్యంలో పంగులూరి శ్రీనివాసరావు, గొల్లపూడి సుబ్బారావు, నర్రా దశరథరామయ్య, కట్ల మాణిక్యరావు, నంబూరి గురుప్రసాద్, కొంగర శ్రీరామ మూర్తి, ముప్పా కృష్ణారావు, నాయుడు అంకమ్మ చౌదరి, పొట్లుదుత్తి శ్రీనివాస రావు, దుడ్డు కమలాకర్‌రావు, కుంచాపు నరసయ్య, రేగులగడ్డ మోసెస్, రేగులగడ్డ చింపిరయ్య, కలతోటి రవి, కట్ల శశికిరణ్, డేలా జయప్రకాష్, రావి నాగేశ్వరరావు, చెన్నుపల్లి బావనారాయణ, మోతుకూరి వేణుగోపాలరావు, చెన్నుపల్లి శ్రీనివాసరావు, సత్యనారాయణ, మూడావత్ మల్లేశ్వర్‌నాయక్ తదితరులు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు.

మార్టూరు గ్రామంలో..మార్టూరులో ముక్తిపాటి మణికంఠ, అద్దేటి దుర్గ, ముక్తిపాటి అంకమ్మరావు, అద్దేటి గోపి, పేరుస్వాములు రవి, కిరణ్ పేరుస్వాముల హరిబాబు, ముక్తిపాటి సాయిబాబు, బొగ్గవరపు కార్తీక్ వంశీ, నాగండ్ల చంద్రం, ముక్తిపాటి శ్రీ కాంత్ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

వలపర్ల గ్రామంలో.. మార్టూరు మండలం వలపర్ల గ్రామానికి చెందిన పిల్లలమర్రి అరేంద్ర, సోముల లక్ష్మీనారాయణ, బిట్ర సురేష్, చంద్రయ్య, వెంకటేష్, రామకోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శ్రీనివాసరావు, మల్లికార్జున, రామాంజనేయులు, శ్రీనివాసరావు, కోటిరత్నం, పుల్లయ్య సైకిలెక్కారు.

ఏలూరికి బ్రహ్మరథం

- ఆకట్టుకున్న ఎడ్లబండి ప్రచారం
- ఘనస్వాగతం పలికిన కుంకలమర్రు గ్రామస్థులు

కుంకలమర్రు(పర్చూరు), ఏప్రిల్ 26 : కారంచేడు మండలం కుంకలమర్రులో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఏలూరికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అడుగడుగునా పూలవర్షంతో గ్రామంలోకి సాదరంగా ఆహ్వానించి అభిమానం చాటుకున్నారు. పెద్దఎత్తున మహిళలు తరలి వచ్చి హారతులతో దీవించారు. అభివృద్ధి ప్రదాత మా ఏలూరి అంటూ యువత జేజేలు పలికారు. ఏలూరికి గజమాలతో మహిళలు సత్కరించి అభిమానం చాటుకున్నారు. ఏలూరి ప్రచారానికి పెద్ద ఎత్తున తెలుగుదేశం, జనసేన, బీజేపీ తోపాటు, ఏలూరి అభిమానులు తరలి రావడంతో ప్రధాన వీధులన్నీ జన సంద్రాన్ని తలపించాయి. కార్యక్రమంలో భాగంగా మసీదులో ముస్లింలు ఏలూరి గెలవాలని ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏలూరికి కుంకలమర్రు గ్రామస్థులు అడగడునా నీరాజనాలు పలికారు. మాఓటు మీకేనయ్యా అంటూ వృద్ధులు ఏలూరిని ఆప్యాయంగా పలుకరిస్తూ దీవించారు. ఈ సందర్భంగా ఏలూరి కుంకలమర్రులో ఎడ్లబండిపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రజా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



గజమాలతో ఘనస్వాగతం పలుకుతున్న మహిళలు